# కర్నూలు | నంద్యాల వార్త

11 జనవరి 2023 బుధవారం పేజీలు 4


## ప్రభుత్వం ఆశిస్తున్న రీతిలో గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా సేవలను పెంచండి

**- జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు**

ఆదోని రూరల్,జనవరి 10,ప్రభాతవార్త ప్రభుత్వం ఆశిస్తున్న రీతిలో గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా సేవలను పెంచాలని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు తహశీల్దార్, ఎంపిడిఓలను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ కోటేశ్వరరావు తహశీల్దార్లు, ఎంపిడిఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు సచివాలయాల వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేసి మరింత వేగంగా పారదర్శకంగా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మండలంలోని తహశీల్దార్లు,ఎంపిడిఓలు సిబ్బంది చురుకుగా విధులు నిర్వర్తించేలా చూడాలన్నారు. సచివాలయానికి 10మంది ఉద్యోగులు,దాదాపు 20మంది వాలంటీర్లు చొప్పున మండలానికి సగటున 500మంది ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికి కూడా సచివాలయాల ద్వారా సేవలను అనుకున్న రీతిలో పెంచడం లేదన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు మధ్యాహ్నం 3గంటల



నుండి సాయంత్రం 5గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించేలా తహశీల్దార్లు,ఎంపిడిఓలు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ ఆదోని రెవెన్యూ డివిజన్‌లో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించుట కొరకు డివిజన్‌లోని తహశీల్దార్‌లు, ఎంపిడిఓలతో సమీక్షలు నిర్వహించుకుంటూ తగిన సూచనలు,సలహాలు ఇస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు.

# సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు..!




- వారొచ్చిందే సమయము..!
- బయోమెట్రిక్ వేసి సొంత పనులకై.. బయటకువెళ్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం
- సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్

**తుగ్గలి, జనవరి 10,ప్రభాతవార్త :** మండలంలోని సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మంగళవారం మండల పరిధిలోని పెండేకల్లు గ్రామంలో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 10.40గంటలైనా నలుగురు సచివాలయ ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. వారిలో అగ్రికల్చర్ అసిస్టెంట్,ఇంజనీరింగ్ అసిస్టెంట్,మహిళా పోలీస్, ఏఎన్ఎంలు విధులకు హాజరయ్యారు. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీ సెక్రటరీని వివరణ కోరగా సెలవులో ఎవరు లేరని సమాధానమిచ్చారు. 10.40గంటలైనా విధులకు నలుగురు సచివాలయ సిబ్బంది మాత్రమే హాజరు కావడంతో వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన లేకపోవడం, పలు కారణాలతో సచివాలయ వ్యవస్థ నీరుగారుతోందని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు అధికారులు వారికి తోచిన సమయానికి విధులకు రావడం జరుగుతుందని గ్రామస్తులు మండిపడుతున్నారు. సచివాలయ సిబ్బది పనితీరు,విధులకు హాజరు, తదితర వాటిని పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలా జరుగుతోందని ప్రజలు అంటున్నారు. కొందరైతే ఫేస్ హాజర్,బయోమెట్రిక్ వేసిన అనంతరం తమ సొంత పనుల కోసం బయటకు వెళ్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగుల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## అమ్మా...నేనున్నాను...మీ కష్టాలు తీరుస్తాను..!

- నాయునిచెరువు చెంచుగూడెం కష్టాలు తీర్చిన కలెక్టరు
- ఆకస్మిక తనిఖీలో పలు సమస్యలు వెలికితీత
- కలెక్టరు ముందు వచ్చారు..ఆ తరువాతే తీరిగ్గా తహశీల్దార్



**బండిఆత్మకూరు, జనవరి 10, ప్రభాతవార్తః** చెంచుగూడెం ఏ అధికారి ఇంతవరకు ఆ ప్రాంతాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. మండలస్థాయి అధికారులు అప్పుడప్పుడు తూతుమంత్రంగా అలా వెళ్లి ఇలా వచ్చేవారు. ఆ ప్రాంతంలో ఏదైనా సమస్య జరిగినప్పుడే అధికారులు, పోలీసులు పోయి వచ్చేవారు. 60 సంవత్సరాలుగా చెంచులు నివాసం ఉంటున్న నాయునిచెరువు చెంచుగూడెం ప్రాంతాన్నిమంగళవారం జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఏవరు ఊహించని రితీలో కలెక్టరు రావడంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. హడావిడిగా ఆయన ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. కలెక్టరు రాకతో నాయుని చెరువుచెంచుగూడెంలో నివాసం ఉంటున్న చెంచులకు మహార్ధశ చేకూరినట్లయింది. గూడెంలో 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. 7 కుటుంబాల వారికి ఇళ్లు లేవు. ముగ్గురు వృద్దులకు పెన్షన్ సౌకర్యం లేదు. వీటన్నింటిని కలెక్టరు దృష్టికి తేగా చెంచుగూడెం ప్రజలకు నేనున్నాను, మీకష్టాలు తీరుస్తాను మీరేమి దిగులు చెందవద్దు సమాజంలో మీరు కూడ భాగస్వాములు కావాలని వారికి పిలుపునిచ్చారు. గూడెంలోని ప్రజల సమస్యలను ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఇళ్లులేని 7 కుటుంబాల వారికి ఇళ్ల కట్టించాలని అంతవరుకు వీరికి వసతులు సమకూర్చాలని అధికారులను అదేశించారు.

2లో



## వలస బాట పట్టిన వ్యవసాయ కూలీలు..!

- 25వేల మంది ఉపాధి కూలీలకు గాను
- 15 వందల మందికి పనుల కల్పిస్తున్న ఉపాది సిబ్బంది



**గోనెగండ్ల జనవరి 10 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వ్యవసాయ కూలీలు బతుకు తెరువుకోసం వలస బాట పట్టారు.గత నాలుగు రోజుల నుంచి మండల పరిధిలోని గాజులదిన్నె, గోనెగండ్ల, కులుమాల, హెచ్ కైరవాడి, అగ్రహారం, బైలుప్పల, చిన్నమరివీడు, గంజహళ్ళి, పెద్దమరివీడు, తదితర గ్రామాలకు చెందిన కూలీలు గుంటూరు, హైదరాబాదు, తెలంగాణ, విజయవాడ, రాయచూరు, ప్రాంతాలకు వలస బాట పట్టారు.సోమ, మంగళవారాలలో దాదాపు 50 కుటుంబాలు గుంటూరు పత్తి పొలంలో కూలీపనులకు బయలుదేరారు.స్థానికంగా పొలం పనులు లేక పోవడం కారణంగా వలసలు పోతున్నట్లు కూలీలు తెలుపుతున్నారు.గుంటూరు,తెలంగాణ ప్రాంతాల్లో పత్తి పొలాల్లో పనులు ఉన్నాయని అక్కడ ఫిబ్రవరి వరకు పనులు చేసుకొని స్వంత గ్రామానికి వస్తామని కూలీలు అంటున్నారు.గత రెండు రోజుల్లో దాదాపు 300 కుటుంబాలు వలస పోయినట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. మండలంలో ఉపాది పనులు సక్రమంగ అమలు జరపక పోవడం,కూలీలకు గిట్టుబాటు కూలీలు అందక పోవడం కారణంగా వలస బాట పడుతున్నట్లు కూలీలు తెలుపుతున్నారు.అయితే మండల వ్యాప్తంగా 14వేల జాబ్ కార్డులు,25వేల మంది ఉపాధి కూలీలు ఉన్నారు.ప్రస్తుతం మండల వ్యాప్తంగా 15వందల మంది కి ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఏపివో బోజ్జయ్య తెలిపారు.



## ముఖ్యమంత్రి జగనన్న పాలన..స్వర్ణయుగం..!

- పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు
- మంత్రి గుమ్మనూరు జయరాం

**ఆలూరు/ఆలూరు రూరల్,జనవరి 10,ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన స్వర్ణయుగంలా ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మరకట్టు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జయరాంకు వైకాపా నాయకులు,కార్యకర్తలు పూలమాలతో ఘనస్వాగతం పలికారు. ముందుగా మంత్రి జయరాం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి సచివాలయ సేవల గురించి ఆరాతీశారు. గ్రామంలో సంక్షేమం మరియు సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ మహాత్మ గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం గ్రామ స్వరాజ్యమని అటువంటి గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల దగ్గరకు మన రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల సమస్యలు గ్రామ స్థాయిలోనే పరిష్కరించే విధంగా 10మంది ఉద్యోగులను నియమించిందన్నారు. ప్రజల ఏదైన సమస్యతో సచివాలయానికి వస్తే వారి సమస్యలను ఓపికతో విని ఆ సమస్యలను పరిష్కరించాలని ఒకవేళ ఆ సమస్య మన పరిధిలో లేకపోతే వారికి అర్థమయ్యే విధంగా సమాధానం చెప్పాలని సూచించారు. అనంతరం మంత్రి గ్రామంలోని ఇంటింటికి నేరుగా వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజలతో మమేకమై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు,వారి ఇంటికి చేకూరుస్తున్న లబ్ధి గురించి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారుంటే వారి వివరాలు సేకరించి పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు,వాలంటరీలు,సచివాలయ సిబ్బందికి సూచించారు. మరకట్టు గ్రామ పంచాయతీకి సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.6.50కోట్లు లబ్ధి చేకూర్చిందని మంత్రి తెలిపారు. గ్రామంలో మంత్రి కాలనీల్లో పర్యటిస్తుండగా గ్రామస్తులు తాగునీటి సమస్య ఉందని మంత్రి దృష్టికి తీసుకురాగా మంత్రి స్పందించి వైఎస్సార్ సుజల స్రవంతి ద్వారా గ్రామంలో ప్రతి ఇంటికి కొళాయి అందించేటట్లు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో డ్రైనేజీ కాలువలకు రూ.20లక్షలు మంజూరు చేశారు. అలాగే మరకట్టు గ్రామం నుండి మెయిన్ రోడ్డు బైపాస్ వరకు 2.5కి.మీల బిటి రోడ్డు పూర్తి చేశామని మిగిలిన 1.5కి.మీల రోడ్డును త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మూడున్నరేళ్ల సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలందరు సుభిక్షంగా ఉన్నాంన్నారు. రైతన్నలకు పెద్దపీఠ వేశారన్నారు. తదనంతరం మంత్రి జయరాంను వైకాపా నాయకులు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు, ఆలూరు వైకాపా ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఎంపిపి కురువ శ్రీరాములు,ఎంపిటిసి జానకి ఉచ్చీరప్ప,సీనియర్ నాయకులు మల్లికార్జునరెడ్డి,మాజీ జడ్‌పిటిసి రామ్‌భీమ్‌నాయుడు, మాజీ సర్పంచ్ యల్లప్ప, మండల కన్వీనర్ వీరేష్,నాయకులు సోమేశ్వరరెడ్డి,వీరభద్రారెడ్డి, పాలాక్షిరెడ్డి, ప్రహ్లాద్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## అనుమానస్పద స్థితిలో..
# వదిన,మరిది మృతి

**- రంగాపురంలో అలుముకున్న విషాదఛాయలు**

**బేతంచెర్ల, జనవరి10,ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో కమ్మాలపాటి సునీత(28),కమ్మాలపాటి అశోక్(25)అనే వదిన,మరిదిలు మంగళవారం తెల్లవారుజామున అనుమానస్పద స్థితిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.వివరాల మేరకు గ్రామానికి చెందిన కమ్మాలపాటి మధుకు మహానంది మండలం బోయలకుంట్ల గ్రామానికి చెందిన సునీతతో వివాహమైంది.వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.మధుకు తమ్ముడు వరుస అయిన మృతుడు అశోక్‌కి నంద్యాల మండలం దీబగుంట్ల గ్రామానికి చెందిన రాణితో వివాహమైంది.వీరికి ఒక కూతురు,కుమారుడు ఉన్నారు.అయితే గత కొంత కాలంగా సునీతతో అశోక్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తుంది.దీంతో పలుమార్లు బంధువులు ఇరువురిని మందలించారు.పోలీస్‌స్టేషన్‌ను కూడా ఆశ్రయించినట్లు సమాచారం.ఈనెల 9వ తేది సునీత తల్లిదండ్రుల వైపు నుండి ఇరువురిని మందలించి వెళ్లారని తెలిసింది.దీంతో మనస్థాపానికి గురైన అశోక్,సునీతలు అశోక్ ఇంట్లో ఎవరులేకపోవడంతో ఆత్మహత్య చేసుకుని విగతజీవులుగా కనిపించారు.అశోక్ ఉరివేసుకుని,సునీత పురుగుల మందు తాగి మృతి చెందినట్లు కనిపించడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.సమాచారం అందుకున్న సీఐ ప్రీతమ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగింది.అనంతరం బంధువులు ఇరువురికి ఆర్ఎస్ రంగాపురంలో అంత్యక్రియలు నిర్వహించారు.





## ఇళ్ళ నిర్మాణాల్లో నిర్లక్ష్యాన్ని వీడండి - వేగాన్ని పెంచండి

- ఉగాది నాటికి 10,004 ఇళ్లు పూర్తికావాలి : జిల్లా కలెక్టరు

**నంద్యాల, జనవరి 10, ప్రభాతవార్తః** జగనన్న లేఅవుట్‌లలో నిర్మించనున్న ఇళ్ళ నిర్మాణాల్లో నిర్లక్ష్యాన్ని వీడి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ అదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో విడియోకాన్ఫరెన్స్ లో జేసి నిశాంతితో కలిసి ప్రగతి తక్కువగా ఉన్న సచివాలయాల వారిగా అదేశించారు. కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం గృహనిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో ఇళ్ళ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని అదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉగాది నాటికి 10,004 ఇళ్లు పూర్తిచేయాలన్న లక్ష్యంగా పనిచేయాలని ఇప్పటి వరకు 159 గృహాలు పూర్తి అయ్యాయని మిగిలిన గృహాలను పూర్తిచేసేందుకు స్పెషల్ అధికారులు, హౌసింగ్ అధికారులు, ఎంపిడఓలు, తహశీల్దార్‌లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని అదేశించారు. ప్రగతిలో 78 సచివాలయాలు వెనకబడి వున్నాయని దానికి కారణాలు ఏంటని అధికారులను ప్రశ్నించారు. ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయితే జియో ట్యాగింగ్ చేసి ఎం బుక్కు రాసి అయా స్టేజిలకు సంబంధించిన బిల్లులు అప్లోడ్ చేయాలన్నారు. ప్రగతి తక్కువగా ఉన్న సచివాలయాలన్ని వచ్చే వారానికి అభివృద్ధిలోకి రావాలని సూచించారు.జేసి నిశాంతి మాట్లాడుతూ ప్రణాళిక లేకుండా ఇళ్ళ నిర్మాణల ప్రగతి ఎలా చూపిస్తారని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు, సచివాల యాలకు టార్గెట్ చాల తక్కువగా ఉందని అందుకు కారణాలు తెలపాలని రూఫ్‌లెవెల్, రూఫ్ కాస్ట్‌స్థాయిలో ఉన్న గృహాలను కూడ పూర్తి చేయలేకపోతున్నారని తెలిపారు. వీడియో సమీక్ష సమావేశంలో హౌసింగ్ ఈఈ మాధవరావు, జడ్పీడిప్యూటి సిఇఓ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, తహశీల్దార్‌లు, విద్యుత్, హౌసింగ్ డిఇలు, ఎఇలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు




## ఈనెల 13న శ్రీశైలానికి కర్నాటక.. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన

**నంద్యాల, జనవరి 10, ప్రభాతవార్తః** శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివార్ల దర్శనార్థం ఈనెల 13వ తేదిన కర్నాటక రాష్ట్రముఖ్యమంత్రితో పాటు ముగ్గురు క్యాబినెట్ మంత్రులు శ్రీశైలంలో పర్యటించనున్న నేపధ్యంలో అన్నిరకాల ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ అధికారులను అదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీశైలం పర్యటన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. శ్రీశైలం వస్తున్న నేపధ్యంలో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని భ్రమరాంభ మల్లిఖార్జున దర్శన అనంతరం జాతి సమ్మేళన కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్నట్లు కలెక్టరు తెలిపారు. పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిఒక్క అధికారికి కేటాయించిన విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహారించాలని పర్యటన ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను అదేశించారు. సమావేశంలో జేసి నిశాంతి, డిఆర్వో పుల్లయ్యతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# మట్టి తరలింపు అక్రమమా...? సక్రమమేనా...!?

**శ్రీశైలంప్రాజెక్టు,జనవరి10,ప్రభాతవార్త** శ్రీగిరిక్షేత్రంలో గోశాల పైబాగంలో లోతట్టు ఎగువ ప్రాంతంనుండి ట్రిప్పర్లతో తరలిస్తున్న ఎర్ర మట్టి అక్రమమా..? సక్రమమేనా..? అన్న సందేహాలు క్షేత్రంలో చర్చానీయాంశంగా మారింది.క్షేత్రంలో అయా ప్రాంతాల్లోకి ఎర్రమట్టిని తరలించి రోడ్డు,అయా ప్రాంతాల్లో చదును చేస్తూ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.మట్టి తరలింపు దేవస్థానం వారు టెండర్ ప్రక్రియ ద్వారా ఒప్పందం కుదుర్చుకుందని విశ్వసనీయ సమాచారం.ఈ నేపధ్యంలోనే సంబందింత గుత్తేదారుడు మట్టి తరలింపును అటవిశాఖ భూమిలో త్రవ్వకాలు చేస్తున్నాడా...? లేక దేవస్థానం భూమిలో త్రవ్వకాలు జరుపుతున్నాడా...? అనేది వెలుగు చూడాల్సి ఉంది.అయితే సదరు గుత్తేదారుడు త్రవ్వుతున్న మట్టి అటవిశాఖకు చేందిన భూమిలో నుండి త్రవ్వకాలు జరుపుతున్నాడని ఆశాఖకు సమాచారం అందడంతో సంబందిత సిబ్బంది పరిశీలనకు వెళ్లినట్లు సమాచారం.ఈ మట్టి తరలింపులో అటవిశాఖ వారు గుత్తేదారునితో లోగుట్టు ఒప్పందం ఏమైన కుదుర్చుకోని మిన్నకుండిపోయారా...? అని పుకార్లు శికార్లు చేస్తున్నాయి.అదే విధంగా దేవస్థానం గుత్తేదారుని నుండి తీసుకున్న ఒప్పందం ప్రకారం మట్టి తరలింపునకు ఎక్కడ నుండి తరలించేందుకు లీడ్ టేండర్‌లో సూచించిందో వెల్లడి కావాల్సి ఉంది. గుత్తేదారుడు ఎర్రమట్టి తరలింపును జేసిపిలతో త్రవ్వుతూ,ట్రిప్పర్లతో తరలిస్తు పనులు చకచక నడిపేస్తున్నాడు.ఇప్పటికే గత మూడు,నాలుగు రోజుల నుండి కోనసాగుతుందని కాలనీవాసుల సమాచారం. ఈక్రమంలోనే మట్టి తరలింపు పెద్ద ఎత్తున కొనసాగుతుండడం గమనార్హం.అదే విధంగా దేవస్థానం వారికి,అటవిశాఖకు చేందిన భూముల సరిహద్దు వివాదం ముగియడంతోనే ఎర్రమట్టి తరలిస్తున్నారా...? లేక పర్వదిన వేడుకలు చేరువలో ఉండడంతో తరలింపును దేవస్థానం కోనసాగిస్తుందా...? అనే ప్రశ్నలు క్షేత్రంలో వెల్లువేత్తుతున్నాయి.అయితే గుత్తేదారుడికి దేవస్థానం వారు ఇచ్చిన లీడ్ నుండి కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారంమే మట్టి తరలింపు జరుపుతున్నాడా...? లేదా అనేది వెల్లడికావాల్సి ఉంది.ఈ యొక్క మట్టి తరలింపుపై ఇరుశాఖల ఒడంబడిక ఏమి కుదుర్చకున్నదో వాస్తవాలు తెలియాల్సి ఉంది.



# అమ్మా...నేనున్నాను...మీ కష్టాలు తీరుస్తాను..!

(తరువాయి)
వృద్దులు ముగ్గురికి పెన్షన్ లేకపోవడంతో వారికి వెంటనే పెన్షన్ సౌకర్యం కల్పించి వారికి సొమ్ము చెల్లించాలని ఎంపిడిఓ వాసుదేవ గుప్తాను అదేశించారు. కలెక్టరే తహశీల్దార్ కార్యాలయానికి ముందు వెళ్లగా ఆ తరువాత తీరిగ్గా తహశీల్దార్ ఉమారాణి అలస్యంగా రావడంతో ఇలాగైతే ఎలా అమ్మా అంటూ తహశీల్దార్‌ను ప్రశ్నించారు. చెంచుగూడెంలో వున్న చిన్నారులు చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దాంతో కలెక్టరు అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను అదేశించారు. చెంచులమైన మేము తమ వృత్తిపరమైన పనుల కోసం అడవికి తేనే, బంక తదితర మూలికల సేకరణకు ఎల్లకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని పొట్టకూటి కోసం ఎనో న సంవత స రాల నుంచి అటవీపై అధారపడి ఉన్నామని వారు అడ్డుకుంటే పూటగడవడం కష్టమన్నారు. విద్య, వైద్య సౌకర్యాలతో పాటు ఉపాధిహామి పనులు, పొదుపులక్ష్మీ మహిళలకు రుణ సదుపాయం అందించాలని అదేశించారు. ఓ భక్తుడు ఓంకారం నుంచి బండిఆత్మకూరు వరుకు రోడ్డు సరిగా లేదని ఓంకారంకు వచ్చే భక్తులు రోడ్డుసౌకర్యం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టరు దృష్టికి తెచా ్చరు. చెంచుగూడెంకు రహదారి గతంలోనే మంజూరైనప్పటికి పూరి్తచేయాలని అధికారులను అదేశించారు. నాడు నేడు పనులపై పురోగతిని గురించి ఎంఇఓ కరిముల్లాను ప్రశ్నించారు. మండలంలో జగనన్న లేఅవుట్‌లు, జగనన్న వసతి గృహాలకు సంబంధించి ఎన్ని మంజూరు అయ్యాయి. ఎంతవరకు పూర్తి అయ్యాయి అనే విషయాలను మండల ఇంజనీర్ అడిగారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

### డయల్ యువర్ ఎస్ఈకి 18 ఫిర్యాదులు

**కర్నూలు జిల్లా పరిషత్, జనవరి 10, ప్రభాతవార్త :** ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్సీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి ఫోన్ కాల్స్ ద్వారా 18 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. ఇందులో ప్రధానంగా కరెంట్ బిల్లుకు సంబంధించి 3, లైన్‌కు సంబంధించి 3, కరెంటు స్తంభాలకు సంబంధించి 2, మీటర్ సమస్యలు 1, లో ఓల్టేజీ సమస్యలు 2, కొత్త సర్వీల కొరకు 3, ఇరత కరెంటు సంబంధించి 4 ఫోన్ కాల్స్ మొత్తం 18 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్ఈ తెలిపారు. వీటిని సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో డి.ఇ విజయభాస్కర్ పాల్గొన్నారు.

## స్త్రీనిధి రుణాల చెల్లింపులో అవకతవకలపై రికార్డులను పరిశీలన

**వెల్దుర్తి, జనవరి10, ప్రభాతవార్త :** వెల్దుర్తిలో స్త్రీనిధి రుణాల చెల్లింపులో బుక్‌కీపర్ల అవకతవకలపై వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు సంబంధించి మంగళవారం జిల్లా స్త్రీనిధి అధికారులు స్థానిక వైకెపి కార్యాలయంలో జిల్లా అధికారులు రికార్డులను పరిశీలించారు. స్త్రీనిధి ఏజిఎం నాగప్రసాద్, స్త్రీనిధి మేనేజర్ శశిధర్‌రెడ్డి రికార్డులు పరిశీలించి వివరాలను ఏపిఎం చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్‌లోని స్త్రీనిధి రుణాలు, చెల్లింపుల వివరాలను వారు స్వయంగా తనిఖీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా అధికారులకు నివేదికలు అందిస్తామన్నారు.

## భౌతికకాయానికి నివాళులర్పించిన బీసీ ఇందిరారెడ్డి

**బనగానపల్లెరూరల్, జనవరి10, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన మల్లు మద్దిలేటిరెడ్డి మాతృమూర్తి వెంకటలక్ష్మమ్మ(75)మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి, రాష్ట్ర థాయ్ బాక్సింగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డి బీరవోలు గ్రామానికి చేరుకుని వెంకటలక్ష్మమ్మ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నిత్యన్నదానానికి దాతల విరాళాలు

**వెల్దుర్తి, జనవరి10, ప్రభాతవార్త :** జర్నలిస్టు కాలనీలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర సద్గురుసాయినాథ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న నిత్యన్నదానానికి మంగళవారం దాతలు విరాళాలు అందించారు. నార్లాపురంకు చెందిన అనిల్ కుటుంబసభ్యులతో కలిసి 2 ప్యాకెట్ల బియ్యం, అదే గ్రామానికి చెందిన క్రిష్ణమోహన్ రూ.2వేలు ఆలయకమిటీ ఉపాధ్యక్షులు వి.యం.గోపినాథ్‌నాయుడుకు అందించారు. అన్నదానంలో తాము భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉందని దాతలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రధానఅర్చకులు యార్లపాటిశ్రీధర్‌శర్మ, ఆలయకమిటీ అధ్యక్షులు బొమ్మనాగసుదర్శన్‌రెడ్డి, కమిటీ సభ్యులు చిరంజీవి, మధు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం

**బనగానపల్లె, జనవరి10, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన శ్రీ పెద్దమ్మ తల్లి నిత్యాన్నదాన భవన నిర్మాణానికి నంద్యాల జిల్లా గోస్పాడు మండలం రాయపాడు గ్రామానికి చెందిన కాటంరెడ్డి చెన్నారెడ్డి ఆయన సతీమణి జయలక్ష్మమ్మల కుమారుడు విజయసాగర్‌రెడ్డి వీరి ధర్మపత్ని నిఖితల కుమారుడు చిరంజీవి హేమాన్స్‌రెడ్డి, వీరి కుటుంబ సభ్యులు టంగుటూరు పెద్దమ్మ తల్లి మీద భక్తితో తమ వంతు విరాళంగా రూ.50వేలు అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు రామగంగిరెడ్డి తెలిపారు. శ్రీ టంగుటూరు పెద్దమ్మ తల్లి మీద భక్తితో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి తమ వంతు విరాళం అందజేసినట్లు దాతలు తెలిపారు. విరాళం అందించిన దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్‌వాడీ పోస్టులకు 56 దరఖాస్తులు

**పత్తికొండ, జనవరి10, ప్రభాతవార్త:** పత్తికొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆయా పోస్టులకు 42 దరఖాస్తులు వచ్చినట్లు ఐసీడీఎస్ సీడీపీవో సావిత్రిదేవి మంగళవారం తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 1 మిని అంగన్‌వాడీ పోస్టుకు 7 దరఖాస్తులు, 2 టీచర్ పోస్టులకు 7 దరఖాస్తులు, 15 ఆయా పోస్టులకు 42 దరఖాస్తులు వచ్చినట్లు సీడీపీవో సావిత్రిదేవి తెలిపారు. కాల్‌లెటర్లు అందినవారికి ఈనెల 12వ తేదిన పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో ఆయా పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు సావిత్రిదేవి తెలియజేశారు. అలాగే గోనెగండ్ల మండలానికి సంబంధించిన పోస్టులకు 13వ తేదిన ఆదోని ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఆమె తెలియజేశారు.

## 23 అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత

**బేతంచెర్ల, జనవరి10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో విజేయుడు అనే వ్యక్తి అక్రమ మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రీతమ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కర్నాటకకు చెందిన టెట్రా 90ఎంఎల్ మద్యం బాటిళ్లను తెచ్చి గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్నాడన్న సమాచారంతో దాడిచేసి అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

## తిప్పనూరులో టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు

**గోనెగండ్ల జనవరి 10 ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో సంక్రాంతి సందర్బంగా 12వ తేదీ నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈపోటీలను మాజీ మంత్రి దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10,000, రెండవ బహుమతి రూ.5000ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12వ తేదీలోపు అసక్తి గల క్రీడాకారులు రూ.300 ప్రవేశ రుసుము చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9912632217, 9885641857 లకు సంప్రదించాలని కోరారు.

## జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే విగ్రహ ఆవిష్కరణ

**కోడుమూరు, జనవరి 10, ప్రభాతవార్త ః** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని మంగళవారం మండల విద్యాధికారి అనంతయ్య ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి భారత మొదటి మహిళా టీచర్‌గా పనిచేసిందన్నారు. అంతే గాక అప్పట్లోనే మహిళల్లో అక్షరాస్యత సాధించేందుకు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. గతంలో ప్రజల్లో అక్షరాస్యత లోపించడంతో వెనుకబాటు జీవితాలను గడుపుతూ మగ్గిపోయే జనాల్లో అక్షరాస్యత ఆవశ్యకత గురించి ప్రజల్లో వివరిస్తూ వారి చైతన్య పర్చేందుకు చేసిన సేవలను ఎన్నటికీ మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యు.పద్మావతి, కళాశాల లెక్చరర్స్ కొమ్ముపాలెం శ్రీనివాసులు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెం.1ని రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల నిరసన

కోడుమూరు, జనవరి 10, ప్రభాతవార్త ః స్థానిక కోట్ల సర్కిల్ దగ్గర మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా అమలులోకి తీసుకువచ్చిన జీవో నెం.1ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ నిరసన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా వామపక్షాల నాయకులు ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. ప్రభుత్వ పాలనపై ప్రజలల్లో వ్యతిరేకతలు వచ్చిన సమయాలలో ప్రతి పక్షాలు చేపట్టే ఆందోళనలకు, ర్యాలీలు సభలకు నిషేదం విధించే హక్కును కాలరాయడం హేయమైన చర్యన్నారు. గతంలో ఇలాంటి చట్టాలు బ్రిటీష్ పాలనలో ఉన్న చట్టాన్ని నేడు తెరపైకి తీసుకురావడం సరికాదని, ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వామపక్షాల నాయకులు సిపిఐ రాజు, రాముడు, సిపిఎం గఫూర్‌మియ్యా, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ కుటుంబంపై దాడి చేసిన భూకబ్జాదారుడిని వెంటనే అరెస్టు చేయాలి

**ఆదోని, జనవరి 10, ప్రభాతవార్త :** పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామ దళితుడైన నారాయణ కుటుంబంపై దాడి చేసిన భూకబ్జాదారుడుని వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కప్పలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేసి వారు మాట్లాడారు. దళితుడైన నారాయణ పొలంలో జొరబడి దున్నడమే కాక ఎందుకు దున్నుతున్నారన్న నారాయణ కుమారులు మధు, మాధవకృష్ణ, భార్య ఈరమ్మలను కులంపేరుతో దూషించి విచక్షణ రహితంగా దాడిచేసిన వైసిపి ఎమ్మెల్యే అనుచరులను వెంటనే అరెస్టు చేసి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు పట్టణ అధ్యక్షులు బాలాజీ, పట్టణ నాయకులు వీరేష్‌బాబు, మండల కార్యదర్శి బసాపురం ఈరన్న, కౌతాళం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

**–ఈనెల 31లోపల అన్‌లైన్‌లో దరఖాస్తులు–ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష : డిఇఓ అనురాధ**

**నంద్యాల విద్య, జనవరి 10, ప్రభాతవార్తః** కేంద్ర ప్రభుత్వ అధీనంలో నిర్వహించే జవహర్ నవోదయ పాఠశాలల్లో 2023–24 సంవత స రానికి 6వ తరగతిలో అడ్మిషన్ల కోసం ఈనెల 31వ తేదిలోపల అన్‌లైన్‌లో చివరి తేదిగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు. మంగళవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఆమె తెలిపిన వివరాల మేరకు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల్లో మాత్రమే ఉన్న నవోదయ పాఠశాలల్లో సిబిఎస్ఈ సిలబస్ అమలుచేస్తున్నారు. ఈపాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ప్రవేశపరీక్షను ఈఏడాది ఏప్రిల్ 29వ తేదిన పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈపాఠశాలల్లో కో–ఎడ్యూకేషన్ అమలులో ఉన్నప్పటికి బాలికలు, బాలుర వేర్వేరుగా వసతి గృహాలు ఉంటాయి. ఉచిత విద్య, ఉచిత భోజన సౌకర్యంతో పాటు కల్చరల్ ప్రోగ్రామ్‌లు, స్పోర్ట్స్ గేమ్ స తో పాటు ఎన్‌సిసి, స్కౌట్, ఎన్‌ఎస్‌ఎస్ వంటి వాటికి శిక్షణ ఇస్తారు. అభ్యర్థులు రెండు దశల్లో దరఖాస్తు చేసుకోవాలి స్టేజ్–1లో అభ్యర్థి రిజిస్ట్రేష్ చేసుకోవాలి, స్టేజ్ 2లో వ్యక్తిగత వివరాలతోపాటు స్కాన్‌కాపీలు అప్లోడ్ చేయాలి. ఫోన్ నంబరు తప్పనిసరి. స్టేజ్ 1, స్టేజ్–2లలో పూర్తిచేసుకున్న వారి మాత్రమే ఎంపిక పరీక్ష రాయడానికి అర్హులు, ఏ ఇంటర్‌నెట్ సెంటర్‌లోనైనా దరఖాస్తు చేసుకోవడానికి హెచ్ఎం సంతకం చేయించి స్కాన్ చేసిన 3,4,5 తరగతులు స్టడి సర్టిఫికెట్లు, స్కాన్ చేసిన అభ్యర్థి ఫోటో, సంతకం, స్కాన్‌చేసిన తండ్రి సంతకం ఉండాలి. ఈ పాఠశాలలో చేరేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022–23 సంవత స రానికి 5వ తరగగతి చదువుతుండాలి. 3,4, తరగతులు కూడ గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే చదివి ఉండాలి. 01-05-2011 నుంచి 30-04-2013లోపల పుట్టిన బాలబాలికలు అర్హులు. ఈపాఠశాలల్లో 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు అవకాశం కల్పించబడును, ఎస్సీ, ఎస్టీ, బిసిలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలు వర్తిస్తాయి. అర్హులైన అభ్యర్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## దివ్యాంగ విద్యార్థులను దాతలు ప్రొత్సహించాలి

**పాములపాడుటౌన్, జనవరి10, ప్రభాతవార్త :** దివ్యాంగులైన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు దాతల ప్రొత్సహం అవసరమని మండల విద్యాధికారి బాలాజీనాయక్ పిలుపునిచ్చారు. పాములపాడులోని భవిత సెంటర్‌కు మోటారు వెహికిల్ ఇన్స్‌పెక్టర్ పద్మభూషన్‌రెడ్డి తమవంతు సహకరంగా రూ.10వేలు విలువ చేసే ఫిజియోథేరఫి పరికరాలను అందచేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలాజీనాయక్ మాట్లాడతూ మోటారు వెహికిల్ ఇన్స్‌పెక్టర్ పద్మభూషన్‌రెడ్డి మానవాత దృక్పంతో సహకారం అందించడమని తెలిపారు. దివ్యాంగులైన విద్యార్థినీ విద్యార్థుల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌యం వెంకటసుబ్బమ్మ, ఐఈఆర్టీలు షంషద్దీన్, రామమూర్తి, ఫిజియోథేరపి కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

## కాండం తొలుచుపురుగు నివారణపై అవగాహన సదస్సు

**వెలుగోడు, జనవరి10, ప్రభాతవార్త :** వెలుగోడు మండలంలోని రైతులకు షాదిఖానాలో సోమవారం వరిలో కాండం తొలుచుపురుగు నివారణపై అవగాహన సదస్సు ను ఎఫ్ఎంసీ కంపెనీలో అధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి అతిధిగా వెలుగోడు మండల వ్యవసాధికారిణి సునీతా పాల్గొన్నారు. ఈసందర్భంగా సంస్థ జోనల్ మార్కెంటింగ్ మేనేజర్ కిరణ్ కుమార్ ప్రొజెక్టర్ ద్వారా రైతులకు వివరించారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు పెర్టెరా గుళికలు ఎకరానికి 4 కిలోల మోతాదులో చల్లుకోవడం ద్వారా అధిక పిలకలు ధృడమైన వేరు వ్యవస్థ వస్తుందని దీనితో కాండం తొలుచుపురుగును సమర్థవంతంగా నివారిస్తుందని తెలియజేశారు. అలాగే తెల్లకంకులు రాలకుండా తెల్ల ఎన్నుపోకుండా నాటిన 45 నుండి 65 రోజుల సమయంలో కొరాజన్ 60 ఎంఎల్ పిచికారి చేసుకోవాలని సూచించారు. ఇప్పుడు మార్కెట్ కంపెనీని పోలిన నకిలీ మందులు వస్తున్నాయని కాబట్టి బుడ్డోడి బొమ్మ చేతిలో గాలిపటం సంస్థ లేబుల్‌న గుర్తుని చూసి కొనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెంటింగ్ కో అర్డినేటర్ తేజశ్విని, రైతులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి : ఎంపిడిఓ

**హొళగుంద, జనవరి 10, ప్రభాతవార్త :** ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ దాసునాయక్, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్‌లు అన్నారు. మంగళవారం హొళగుందలోని తహశీల్దార్ కార్యాలయం వెనుకనున్న రైతుభరోసా కేంద్రంలో ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు ఆధార్ కార్డు మార్పులు, చేర్పులు, కొత్త ఆధార్ సేవలు ప్రారంభం కావడంతో వారు తనిఖీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్, పిల్లలకు కొత్త ఆధార్‌కార్డు, మార్పులు, చేర్పులు, ఫోటో, ఫోన్ నంబర్, చిరునామా మార్పు చేయడం, బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే హెబ్బటం గ్రామ సచివాలయంలో కూడా ఆధార్ సెంటర్‌లో సేవలు ప్రారంభమ య్యాయన్నారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిర్వాహకులు అందుబాటులో ఉంటారని ఈఅవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శిలు కోరారు.

## కార్తికేయునికి ప్రత్యేక పూజలు

**మద్దికెర, జనవరి 10, ప్రభాతవార్త :** కలియుగ దైవం కోరిన కోర్కెలు తీర్చే దేవుడు ఆరోగ్య ప్రధాత కొలిచిన వారికి కొంగుబంగారంగా సంతాన ప్రాప్తి శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు, అర్చనలు విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తాదులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఎస్‌వి విజయ్ ప్రసాద్ విచ్చేసిన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి తీర్థప్రసాదాలు అందచేశారు.

## నేడు రౌండ్ టేబుల్ సమావేశం

**పత్తికొండ, జనవరి 10, ప్రభాతవార్త :** పట్టణంలోని గ్రంథాలయంలో నేడు బుధవారం 11గంటలకు గ్రంథాలయ అభివృద్ధి–పనుల భాగస్వామ్యం అను పేరుతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి యస్ రామ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, సంస్థ కార్యదర్శి ప్రకాష్‌లు హాజరవుతారని కావున పాఠకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

## వ్యాపారస్తులను అనేక ట్యాక్స్‌లతో తీవ్ర ఇబ్బందులకు పెడుతున్న వైసిపి ప్రభుత్వం

**బనగానపల్లెరూరల్, జనవరి10, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని నంద్యాల జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్య కార్యాలయం నందు మంగళవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో వ్యాపారస్తులకు అనేక హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. కాని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడున్నర సంవత్సరాలు దాటినా వ్యాపారస్తులకు ఎటువంటి హామీలు నెరవేర్చకపోగా రకరకాల ట్యాక్స్‌లతో వ్యాపారస్తులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నరన్నారు. అదే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక మద్యాన్ని విడతలవారిగా తగ్గిసానని చెప్పి ఇప్పుడు విడతలవారిగా మద ్యం షాపులను, మద్యం రేట్లను పెంచడమేకాక జే బ్రాండ్స్‌తో ప్రజల ప్రాణాలతో చెలగాటమడుతున్న రన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన అన్నారు. చెత్తకు కూడా పన్ను వేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి వస్తున్న ప్రజాదరణ చూసి జగన మోహన్‌రెడ్డి చీకటి జీవోలను తీసుకువస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ పక్కీర్‌రెడ్డి, యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్ బత్తుల బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామికి సన్మానం

**బనగానపల్లె, జనవరి10, ప్రభాతవార్త:** బనగానపల్లె ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో మండల అధ్యక్షులు జె.వెంకటకృష్ణుడు అధ్యక్షతన నంద్యాల జిల్లా ప్యాప్టో చైర్మన్‌గా ఎన్నికైన ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మాధవస్వామి ఆత్మీయ సన్మానం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలోను, సంఘ కార్యక్రమాలలోను తనదైన శైలిలో న్యాయం చేస్తుండడం వల్లనే ప్యాప్టో జిల్లా చైర్మన్‌గా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామికి దక్కిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు జి.లింగమయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉపాధ్యాయుల హృదయాలలో చిరస్థానం ఏర్పరుచుకున్నారని ప్యాప్టో చైర్మన్ పదవి ఆయనకు తగిందని కొనియాడారు. ఎన్‌జీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ జి.కుమార్ బాబు మాట్లాడుతూ ముమ్ముందు ఉపాధ్యాయుల సమస్యల పట్ల అంకితభావంతో పనిచేసి ఇంకా అనేక పదవులు పొందే నాయకుడిగా ఎదగాలని ఆయన కోరారు. ఇతర ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను తీర్చగలిగే నాయకుడు మన మధ్య ఉండడం చాలా సంతోషకరమని మా నాయకుడికి మా సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని వారు తెలిపారు. సన్మాన గ్రహీత, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్యాప్టో చైర్మన్ బి.మాధవస్వామి మాట్లాడుతూ ఇంతగా ఆదరిస్తూ ఇంత ఆత్మీయంగా నా పట్ల చూపిన మీ అభిమానానికి ధన్యవాదాలు తెలుపుతూ ముమ్ముందు ఉపాధ్యాయుల సమస్యల పట్ల అంకితభావంతో పనిచేసి ఎంతటి కష్టనైనా ఇష్టంగా భరిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి సుంకన్న, రాజు నాయక్, రమేష్ బాబు, నరసింహుడు, కృష్ణయ్య, రఫి, బాలాజీ నాయక్, రాంమోహన్‌రెడ్డి, రహిమాన్, మల్లికార్జున, శివయ్య, దస్తగిరి, పోలియా నాయక్, వెంకటేష్ నాయక్, చాంద్‌బాషా, రమేష్, ఖాద్రీ, వై.సుంకన్న, యల్ల సుబ్బయ్య, షఫి, చిన్నదస్తగిరి, ఓబులేసులతోపాటు మరికొంత మంది ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అత్యంత ఆవశ్యకం

**బనగానపల్లెరూరల్, జనవరి10, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మంగళవారం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఏపీ పోలీస్ పోస్టులకు సిద్ధమవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.స్వర్ణలతాదేవి అధ్యక్షతన కళాశాలలోని విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. అనంతరం స్వర్ణలతాదేవి మాట్లాడుతూ పోలీస్ పోస్టులకు సిద్ధమవుతున్న వారు ఖచ్చితమైన సమయ విధానాన్ని పాటించాలని కోరారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.బడేసాహెబ్ మాట్లాడుతూ యువకులు పోటీ పరీక్షలకు సరైన పుస్తకాలను, దేశ, అంతర్జాతీయ అంశాల పై అవగాహన పెంచుకోవాలని కోరారు. అదే విధంగా కళాశాలలో పేద విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని అందుకే వారి కోసం రూ.10వేలు విలువ చేసే పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కళాశాలలో పోటీ పరీక్షలకు సిద్దపడే వారికి సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.సూర్యనారాయణరెడ్డి, కె.వసుంధర, వి.విజయకుమారి, జె.సుధాకర్‌రెడ్డి, కె.రామకృష్ణ, ఉమామహేశ్వరరెడ్డి, బి.నరేంద్రనాథ్‌రెడ్డి, వెంకటనారాయణ, మహేశ్వరరెడ్డి, వహీదా పాల్గొన్నారు.

## జీవోనంబర్ 1ని రద్దు చేయాలి

**ఆదోనిటౌన్, జనవరి10, ప్రభాతవార్త ;** ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే జీవో నంబర్ 1కు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు జీవో పత్రాలను మంగళవారం దగ్ధం చేసి, ఆందోళన చేపట్టారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సీఐటీయూ సీనియర్ నాయకులు మహానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో ఒకటిని రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేయడం జరుగుతుందన్నారు. ఈ జీవో వల్ల ఉద్యోగ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేయడానికి అవకాశం ఉండదన్నారు. కావునా తక్షణమే జీవో నంబర్ 1ను రద్దు చేయాల న్నారు. అలాగే సీఐటీయూ జాతీయ సహాసభలను ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు బెంగళూరు నగరంలో జరుగుతాయన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఉద్యోగ కార్మికులకు వారు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల్లో వ్యతిరేకత పెరుగుతుందని, కార్మిక హక్కుల కోసం పోరాటాలు చేస్తుంటే ఎక్కడికక్కడే నిర్బంధాలు కొనసాగిస్తుందని, ఇప్పుడు ఏకంగా ఎలాంటి ఆందోళన చేయకూడదని జీవోను తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పి.ఎస్.గోపాల్, లక్ష్మన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాదల్ సభ్యులకు ఐడికార్డులు పంపిణీ



**పత్తికొండ, జనవరి 10, ప్రభాతవార్త :** పట్టణంలోని పోచిమిరెడ్డి సేవాదళ్ కార్యాలయంలో మంగళవారం పోచిమిరెడ్డి సేవాదళ్ వ్యవస్థాపకులు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి పోచిమిరెడ్డి సేవాదళ్ సభ్యులకు కొత్త ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ కొత్త కార్డులు నాణ్యమైనవని కావున ఈ కార్డును కుటుంబ సభ్యులు జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. మున్ముందు సేవాదల్ అందించే లబ్ది ఈ కార్డు ద్వారానే అందిస్తామని తెలియజేశారు. లబ్దిదారులకు ఐడి కార్డుతో పాటు జగన్న నూతన క్యాలెండర్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కోటేశ్వరరావు, గోవిందరాజు, పులికొండ రామానాయుడు, చక్రాల లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నూర్‌భాషా, బోడ శీను, లబ్దిదారులు పాల్గొన్నారు.

## 12న చిత్రలేఖన పోటీలు

**మద్దికెర, జనవరి 10, ప్రభాతవార్త :** ఈ నెల 12వ తేదీన ఆపద్బాంధవ సేవాసమితి ఆధ్వర్యంలో మండల స్థాయి చిత్రలేఖన(డ్రాయింగ్)పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆపద్బాంధవ సేవా సమితి సభ్యులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివేకానంద జయంతి సందర్భంగా 12వ తేదీన ఉదయం 10గంటలకు స్థానిక కెవిఆర్ బాయ్స్ జడ్‌పిహెచ్ఎస్ స్కూల్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9985210169, 8247452474ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## కెవిపిఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**ఆదోని రూరల్, జనవరి 10, ప్రభాతవార్త :** కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఇస్వి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ విజయలక్ష్మి చేతుల మీదుగా కెవిపిఎస్ 2023నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. క్యాలెండర్ మహానీయుల చిత్రాలతో పాటు వారు చేసిన పోరాటం సైతం గుర్తించే విధంగా రూపొందించామని కెవిపిఎస్ మండల కార్యదర్శి బి తిక్కప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తాయన్న, వీరేష్, కాటికాపరి గుంతలు తీసే బేగాల సంఘం నాయకులు యువరాజు, వినోదు, జయరాజు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయండి

**– డిపిఓ నాగరాజు నాయుడు**



**ఆలూరు, జనవరి 10, ప్రభాతవార్త :** ఆలూరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని డిపిఓ నాగరాజు నాయుడు అన్నారు. మంగళవారం ఆలూరులోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని పంచాయతీ సిబ్బందికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండ ఉండేందుకు గ్రామంలో డ్రైనేజీ కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. అనంతరం గణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి ప్రకాష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొనా ్నరు.

## సిఐటీయు జెండావిష్కరణ

**మద్దికెర, జనవరి 10, ప్రభాతవార్త :** సిఐటీయు ఆల్‌ఇండియా 17వ మహాసభల సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం సిఐటీయు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా సిఐటీయు మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమం, విజయవాడ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కడవల రవికుమార్, మండల అధ్యక్షుడు వంశీ, హరి, ఆశా వర్కర్లు, వీఆర్ఏ సంఘం మండల నాయకులు సుంకప్ప, దామోదర్, అనిఫ్, మారుతి, మస్తాన్, పులికొండ, ఆటోయూనియన్ నాయకులు స్వచ్ఛభారత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## విబిఆర్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**దేవనకొండ, జనవరి 10, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గల విబిఆర్ పాఠశాల నందు ముందస్తు సంక్రాంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విబిఆర్ పాఠశాల కరస్పాండెంట్ సుభాన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. విద్యార్థులకు గాలిపటాల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు ఎంతో ఆకర్షణీయంగా అందరిని ఆకట్టుకునే విధంగా ఉన్నాయని కరస్పాండెంట్ సుభాన్ అన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసినట్లు తెలిపారు. ముగింపు వేడుకల్లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్, హరీష్, విజయరాజు, వినయ్ కుమార్, మౌనిక, అనసూయ, రంగవేణి, గాయత్రి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ హాస్టల్ ప్రారంభం

**మాధవరం(మంత్రాలయం), జనవరి 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాధవరం గ్రామంలో మంగళవారం నూతన సీజనల్ హాస్టల్‌ను ప్రారంభించినట్లు ఎంఈఓ మొయినుద్దీన్ విలేకరులకు తెలిపారు. తల్లిదండ్రులు వలస వెళ్ళిన 50 మంది విద్యార్థులను ఈ సీజనల్ హాస్టల్ ద్వారా చదివిస్తున్నట్లు తెలిపారు. ఏఎల్ఈఎస్‌సిఓ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో ప్రారంభించినట్లు చెప్పారు. గ్రామంలోని ఎంపిపిఎస్ మొయిన్ పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కాబట్టి విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నీలకంఠస్వామి, భాస్కర్‌బాబు, సిఆర్‌పి బంగారప్ప తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో రీన్యూ పవర్ కంపెనీ

**– కెజిబివి ఎస్ఓ సునీత**

**ఆలూరు, జనవరి 10, ప్రభాతవార్త :** సామాజిక సేవలో రీన్యూ పవర్ కంపెనీ చేస్తున్న సేవలు మరువలేనివని ఆలూరు కెజిబివి ఎస్ఓ సునీత అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ కెజిబివి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలికలకు రీన్యూ పవర్ కంపెనీ ఆధ్వర్యంలో 300మంది విద్యార్థినీలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా రీన్యూ పవర్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాసులు, మేనేజర్ ఉదయ్‌లు మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సహకారం అందించడానికి రీన్యూ పవర్ సంస్థ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. అలాగే విద్యార్థులు కూడా కష్టపడి కాకుండ ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 12న ఐరనబండలో గడప గడపకు కార్యక్రమం

**దేవనకొండ, జనవరి 10, ప్రభాతవార్త :** ఈ నెల 12న తేదీన మండల పరిధిలోని ఐరనబండ(బి సెంటర్) గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ గౌరీదేవి మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హాజరవుతున్నట్లు తెలియజేశారు. కావున ఆయా శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## హైకోర్టు వ్యాఖ్యాలతో సజ్జలకు సజ్జలు రాలిపోతాయనే భయం

**కర్నూలు న్యూసిటి, జనవరి 10, ప్రభాతవార్త:** వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి పరిపాలన చేత కాక ప్రతిరోజు ఏదో ఒక అంశంపై సోషల్ మీడియాకు అడ్డంగా దొరికిపోవడంతో ఆయన బయటకు రాలేని స్థితిలో ప్రతిచిన్న అంశాన్ని తన సామాజిక వర్గానికి చెందిన సలహాదారులకు అప్పగించి తాను చిరునవ్వుతో పోజులిస్తుంటారని టిడిపి పార్టీ కార్యదర్శి నంద్యాల నాగేంద్ర విమర్శించారు. ఇలా సలహాదారుల నియామకం వైసీపీ ప్రభుత్వంలో పదుల నుండి వందలలోకి చేరడంతో ఎంతో ప్రజాధనం వృదా అవుతుంది. ఐఏయస్‌లుండగా సలహాదారు లలెందుకనీ కోర్టు మందలించడంతో కొందరు కోర్టును తప్పుబడుతున్నారు. హైకోర్టు తప్పుపట్టడంతో సలహాదారు సజ్జలకు సజ్జలు రాలిపోయాయన్నారు. వైయస్ జగన్ పునా ్యమా అంటూ ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ వ్యవస్థలైన పరిపాలన వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయన్నారు. వాటికి ప్రజాగౌరవం లేకుండా పోయాయి అన్నారు. సజ్జల అనవసరంగా రాజ్యాంగ వ్యవస్థల గురించిమాట్లాడకు నీవింకా అంతస్థాయికి ఎదగలేదన్నారు.

## ఎస్పీ కార్యాలయంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

- ప్రతికుటుంబంలో సంక్రాంతి వెలుగులు నింపాలి



**నంద్యాల, జనవరి 10, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పోలీస్‌క్యాంపు అవరణలో పోలీస్ కుటుంబాలకు చెందిన వారికి మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సతీమణి కళ్యాణి అధ్వర్యంలో నిర్వహించారు. పోలీస్ సిబ్బంది ఎప్పుడు విధి నిర్వహణలో నిమగ్నమై పని ఒత్తిడి కారణంగా మహిళలు కూడ ఒత్తిడికి గురవుతుంటారని అలాంటి సందర్భంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడంతో వారు మనశా ్ంతిగా ప్రశాంతత లభిసు ్తదన్న ఉద్దేశ్యంతో ఏర్పాటుచేశారు. పోలీస్‌సిబ్బంది కుటుంబాల్లో సంక్రాంతి వెలుగులు నింపాలని అకాంక్షించారు. ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, రంగవలుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్శనగా నిలిచాయి. ఇప్పటి తరంవారికి భావి తరాల వారికి హరిదాసులు, గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, బోగిమంటలు తెలియకుండా పోతున్నాయని వాటిని అందరికి తెలియజేస్తు రంగువల్లులు ద్వారా ప్రదర్శించడం అభినందనీయం అన్నారు. బోగి, సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకోవాలని అకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళ్యాణి రఘువీర్‌రెడ్డి పాల్గొనగా డా.ప్రసన్న, శిరీష చంద్రబాబు, దుర్గా సుంకరయ్యలు విజేతలకు బహుమానాలు అందజేశారు. మొదటి బహుమతిగా మహానంది పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న లక్ష్మీకాంతమ్మకు రెండవ బహుమతి నంద్యాల తాలూక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న రామకృష్ణమ్మకు, మూడవ బహుమతి లక్ష్మీకి దక్కింది. కార్యాలయ అవరణలో వేసిన ముగ్గులు అందరిని అకర్శించాయి

## మహిళా సహకార్ బ్యాంకు అధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**నంద్యాల హాస్పటల్, జనవరి 10, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలో టెక్కెమార్కెట్‌యార్డు నందు మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి పుట్టిన రోజు, సంక్రాంతిని పురస్కరించుకొని శిల్పా కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను శిల్పా మహిళా సహకార్ చైర్మన్ నాగిని రవిశింగారెడ్డి ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో దాదాపు 200 మంది మహిళలు పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ.15 వేలు నగదు, రెండవ బహుమతి రూ.10 వేలు నగదు, మూడవ బహుమతి రూ.5 వేలు నగదు అందజేశారు. పోటీల్ ్లు పాల్గొన్న ప్రతిమహిళకు బహుమతిని అందజేశారు. ఈసందర ్భంగా మహిళా సహకార్ చైర్మన్ నాగిని రవిశింగారెడ్డి మాట్లాడుతూ ప్రతిసంవత ్సరం లాగానే ఈసంవత ్సరం కూడ పట్టణంలో మహిళలకు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి మధ్యన ఉంటూ వారితో పాటు ముగ్గులపోటీల్లో పాల్గొనడం చాల సంతోషంగా ఉందని మా కుటుంబంపై ఇంతటి అధరాభిమానాలు చూపిస్తున్న ప్రతిఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. నంద్యాల నియోజకవర్గ ప్రజలు అంటే మాకుటుంబానికి ఎనలేని ప్రేమాభిమానాలు వారి సంక్షేమం కోసం ఎనో ్న కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. గెలుపోటములకు, రాజకీయాలకు సంబంధం లేకుండా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్విరామంగా జరుగుతాయన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టరు సునీత అమృతరాజు, మహిళా కౌన్సిలర్లు పున్నారాజేశ్వరీ,శోభారాణి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పేదోళ్ళ కష్టాలకు అండగా

**నంద్యాల క్రైం, జనవరి 10, ప్రభాతవార్త:** ఆర్థికంగా చితికిపోయిన పేద మహిళల సంక్షేమం కోసం శిల్పా మహిళా సహకార్ బా ్యంకు ఏర్పాటు చేశారని మా కష్టాలకు అండగా నిలిచిన మహానుభావుడు శిల్పా మహిళా సహకార్ బ్యాంకు సభ్యులు, మహిళలు కొనియాడారు. మంగళవారం టెక్కెమార్కెట్ యార్డు నందు 144 మందికి రూ.17 లక్షల రుణాలను శిల్పా మహిళా బ్యాంకు చైర్మన్ శిల్పా నాగిని రవిసింగారెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణి చేశారు. ఈసందర్భంగా బ్యాంకు చైర్మన్ మాట్లాడుతూ నిరుపేదలు ఆర్థికంగా అభివృద్ధిచెందేందుకు రూ. లక్షలతో పేద మహిళలకు రుణాలు అందించడం జరుగుతుందని ఎన్నో వేల కుటుంబాలు శిల్పాసహకార్‌లో లబ్ధిపొందుతున్నారన్నారు. మాజీ మంత్రివర్యులు శిల్పామోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలో పండుగ వాతావరణం నెలకొందని ఇంతటి అధరాభిమానాలు అందిస్తున్న ప్రజలకు ప్రతే ్యక ధన్యవాదాలు తెలిపారు. తీసుకున్న రుణాన్ని వృదాచేయకుండా వ్యాపారాల కోసం ఉపయోగించుకోని ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మహిళాబ్యాంకు డైరెక్టరు పూర్ణిమా, మేనేజర్ హరిలీలా, శిల్పాసేవా సమితి మేనేజరు లక్ష్మీనారాయణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శిల్పాజన్మదిన వేడుకల సందర ్భంగా రక్తదానం: మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా టెక్కెమార్కెట్‌యార్డు నందు మహిళా బ్యాంకు చైర్మన్ నాగిని రవిశింగారెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా శిల్పాపుట్టిన రోజుసందర ్భంగా మూడవ సారి రక్తదాన కార్యక్రమం చేపట్టాం. మరికొందరు వైసీపీ నాయకులు రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అభిమానులు స్వచ్చదంగా వచ్చి రక్తదానం చేయడం చాల సంతోషంగా ఉందని మా కుటుంబంపై ఇంత అభిమానాన్ని చాటుకున్న నియోజకవర్గ ప్రజలకు ప్రతే ్యక ధన్యవాదాలు తెలిపారు.

## మున్సిపల్ కార్యాలయంలో ప్రక్షాళన

**నంద్యాల విద్య, జనవరి 10, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన నంద్యాలలో మున్సిపల్ కారా ్యలయంలో ప్రక్షాళన చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ అసిస్ట ్ంటు కమిషనరు వెంకటదాసు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కారా ్యల యంలో విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. కమిషనరు రవిచంద్రారెడ్డి అదేశాల మేరకు ఈసమావేశం నిర్వహించామన్నారు. మున్సిపల్ కమిషనరు నోడల్ అఫీసరుగా ఉన్నారని ప్రతిరోజు అందుబాటులో ఉండేవిధంగా ప్రజలకుమరిన్ని సేవా కార్యక్రమాలుచేపట్టేందుకు ప్రతిరోజు 3 గంటల నుంచి 5 గంటల వరకు సమస్యల పరిష్కారానికి కృషిచేస్తారని తెలిపారు. కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ కేంద్రాన్ని కార్యాలయ మొదటిలో ఏర్పాటు చేస్తున్నారని ఇక్కడ సిబ్బంది అందుబాటులో ఉంటారని కార్యాలయంలో ఏ సెక్షన్‌లో ఫైల్ పెండింగ్ ఉందని అర్జీదారుడు ఆ హెల్ప్‌డెస్క్ కేంద్రంలో చెప్పితే వారే అసెక్షన్‌కు తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తారని తెలిపారు. కార్యాలయంలో పనులు పారదర్శకంగా చేసేందుకు హెల్ప్‌డెస్క్ తోడ్పడుతుందని తెలిపారు. కార్యాలయానికి మూడు దా ్వారాలు ఉన్నాయని ఏవరు వస్తున్నారో, ఏవరుపోతున్నారో తెలియని పరిస్థితి ఉందన్నారు. సిబ్బంది కూడ విధులను సక్రమంగా నిర్వహించేందుకు ఒకేద్వారాన్ని ఉంచి మిగిలిన రెండు ద్వారాలు మూసివేయాలని కమిషనరు అదేశించినట్లు వెంకటదాసు తెలిపారు.కార్యాలయంలో పనులు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు.నంద్యాల్లో 42 వార్డుల్లో సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగపడేందుకు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకోనున్నారు. కార్యాలయ సిబ్బంది శానిటేషన్, ఇంజనీరింగ్, హెల్త్ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు.

## మహిళలు బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసుకోవాలి

- ఏపీజీబీ బ్యాంకు రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్

**గడివేముల, జనవరి10, ప్రభాతవార్త ;** స్వయం సహాయక సంఘ సభ్యులు బ్యాంకుల్లో కనీసం రూ.10 వేలు డిపాజిట్ చేసుకోవాలని గడివేముల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.ఎస్.నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారంనాడు గడివేములలోని ఏపీజీబీ బ్యాంకుశాఖలో బ్యాంకు సిబ్బంది స్వయం సహాయక సంఘ గ్రూపు లీడర్‌లు, సభ్యులు, ఖాతాదారులు, ఐకేపీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజీబీ బ్యాంకు మిగతా బ్యాంకులతో పోల్చితే ప్రత్యేక వడ్డీ అందజేస్తున్నారని, స్వయం సహాయక సంఘాలు మండలంలో 673 గ్రూపులు ఉన్నాయని, అందులో కనీసం 50 శాతం మంది గ్రూపు సభ్యులు రూ.10 వేలు ఫిక్స్ డిపాజిట్ చేసుకుంటే అత్యవసరాలకు ఉపయోగపడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీజీబీ బ్యాంకులో 6.8 శాతం, సీనియర్ సిటీజన్‌లకు 7.6 శాతం వడ్డీ సదుపాయం కల్పిస్తుందన్నారు. గడివేముల శాఖ ద్వారా 673 గ్రూపులకు 30 కోట్ల రుణాలు అందజేశామని, నంద్యాల జిల్లాలో గడివేముల శాఖలో అత్యధిక గ్రూపులో ఉన్న శాఖ అని చెప్పారు. రీజనల్ పరిధిలో ఐదు వేల కోట్ల రుణాలు చేశామని, అందులో 2500 కోట్లు డిపాజిట్లుగా 2500 కోట్లు వివిధ రకాల రుణాల ద్వారా ప్రజలకు అందించామన్నారు. బ్యాంకు అన్ని రంగాల్లో ముందంజలో ఉందని, రైతులకు క్రాప్ లోన్‌లు, ట్రాక్టర్ లోన్‌లు, డైలీ స్కీములు, ప్రతిరైతులు అవసరాలకు గ్రామీణ బ్యాంకు ముందుండి రుణాలు అందిస్తుందన్నారు. మిగతా బ్యాంకులతో పోలిస్తే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంఉలో రిటైల్ లోన్ హౌసింగ్ లోన్‌లు తక్కువ వడ్డీకి అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ బ్యాంకు గడివేముల చీఫ్ మేనేజర్ వర్జిన్‌జాన్, ఫీల్డ్ ఆఫీసర్ విష్ణుతేజ్‌నాయుడు, బ్యాంకు సిబ్బంది, స్వయం సహాయక సంఘం సభ్యులు, ఖాతాదారులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం నవీన్‌కుమార్

## పన్నులు పెంచడం తప్పా ప్రజల కష్టాలన పట్టించుకోని పాలకులు

- ధర్మావరం మన్నె సుబ్బారెడ్డి



ఇదేం ఖర ్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న మన్నె సుబ్బారెడ్డి

**బేతంచెర్ల, జనవరి10, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సొంత గ్రామమైన బేతంచెర్లను నగర పంచాయతీగా మార్చి పేద ప్రజల పై పన్నులు పెంచడం పై ఆసక్తి చూపుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి పేదలు నివసించే కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని డోన్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డు(సంజీవనగర్) నందు టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ నగర పంచాయతీ చైర్మన్‌గా ఎన్నికైన చలంరెడ్డి ఏసీ రూములలో కూర్చొని ప్రజల కష్టాలను పట్టించుకోవడంలేదన్నారు. రోజుకి ఒక గంటైనా పేద ప్రజలు నివసించే కాలనీల్లో తిరిగి వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నించాలని హితవు పలికారు. డోన్ అసెంబ్లీ ఎమ్మెల్యేగా బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని గెలిపిస్తే ఆయన ప్రజాసమస్యలను పట్టించుకోకుండా తన ఆస్తులను పెంచుకోవడంలో బిజీగా మారిపోయారని మీరందరు ప్రజల ఓట్లతో గెలిచి మీ మీ పనుల్లో బిజీ అయిపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ది చెబుతారని మన్నె సుబ్బారెడ్డి హెచ్చరించారు. అనంతరం ఆ కాలనీలో పర్యటిస్తూ ప్రధానంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటన్నింటికి పరిష్కారం రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశానికి అధికారం కట్టబెడితేనే దొరుకుతుందన్న విషయాన్ని ప్రతిఒక్కరు గుర్తించాలని కోరారు. అలాగే మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో టీడీపీ మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, పట్టణ కమిటీ చైర్మన్ ఉన్నం సుధాకర్‌లు, గ్రామ నాయకులు లక్ష్మీకాంతరెడ్డిల ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న రాక్షస పాలనను ఇంటికి సాగనంపాలని కోరారు. ఆయా కార్యక్రమాలలో నియోజకవర్గ టీడీపీ సలహాదారు తిరుమలేష్ చౌదరి, మాజీ ఎంపిటిసి సభ్యులు జాకీరుల్లాబేగ్, ఫయాజ్, రేగటి భీమారెడ్డి, రాష్ట్ర క్రిష్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, నంద్యాల అధికార ప్రతినిధి రూబెన్, రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి రవీంద్రనాయక్, ఆవుల రామకృష్ణ, రామ్మూర్తి, రామాంజనేయులు, రామగోపాల్, వలువురు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి జగన్

**హొళగుంద, జనవరి 10, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని వైసిపి మండల కన్వీనర్ షఫీవుల్లా, ఎంపిపి నూర్జహాన్ తనయుడు ఈసా, సర్పంచ్ చలవాది రంగమ్మ తనయుడు పంపాపతి, అడ్వైజర్ బోర్డు చైర్మన్ కుమార స్వామిలు అన్నారు. మంగళవారం హొళగుంద గ్రామంలో వైఎస్సార్ జలకళ నాల్గవ రోజున అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోరు వేసిన ప్రతిచోట 3ఇంచులకుపైగా నీరు రావడంతో రైతన్నలు అంతుపట్టలేని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. మండలంలో 90శాతం రైతులు పొలంలో నీరు రావడంతో రైతన్నల మొహల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంలకు రైతన్నలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామకృష్ణ, జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్ జొండే సిద్దయ్య, ఎంపిటిసి మల్లయ్య, రైతన్నలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

**హొలహర్వి, జనవరి 10, ప్రభాతవార్త :** అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సిఐటియు మండల నాయకుడు కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హొలహర్వి గ్రామంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఏపి అంగన్‌వాడి వర్కర్ ్స అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆదేశాల మేరకు కార్యకర్తలతో కలిసి ప్లకార్డులతో ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకుడు కృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని, లబ్దిదారులకు ఇచ్చే పౌష్టికాహారం క్వాంటిటి పెంచాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, అంగన్‌వాడీలకు సెంటర్ల పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడిల సెంటర్ల పరిధిలోని పేద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడి సెంటర్‌లోకనీస మౌలిక వసతులు కూడా లేవన్నారు. కొన్ని కేంద్రాలలో అసలు విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యుత్ సౌకర్యం ఉన్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఏ, డిఏలు గత ఐదేళ్లుగా ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6నెలల నుండి బిల్లులు చెల్లించలేదన్నారు. దీనివలన అంగన్‌వాడీలు అప్పులు చేసి లబ్దిదారులకు ఆహారం వండిపెడుతున్నామన్నారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పనిభారం పెంచారన్నారు. కానీ వేతనాలు పెంచలేదని, అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్‌లు పనిచేయడం లేదని, గ్రామాల్లో నెట్ సౌకర్యం ఉండడం లేదన్నారు. ఫేస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. అంగన్‌వాడిలకు ఫేస్ యాప్ వెంటనే రద్దు చేసి పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలన్నారు. సుప్రీంకోర్టు తీరు ్ప ప్రకారం గ్రాడ్యుయేట్ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్‌వైజర్‌పోస్టులో వయో పరిమితి తొలగించాలన్నారు. 300జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. ర్యాలీలు, సభలు నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 1ని వెంటనే రద్దు చేయాలని రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు సుజాత, రాజేశ్వరి, జ్ఞానేశ్వరి, గౌరీ, సరస్వతీ, కామాక్షి తదితరులున్నారు.

## ఎస్‌సి హాస్టల్ కొరకు సంతకాల సేకరణ

**హొళగుంద, జనవరి 10, ప్రభాతవార్త :** హొళగుందలో ఉన్నటువంటి ఎస్‌సి హాస్టల్‌ను పునఃప్రారంభించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నుండి సంతకాల సేకరణ చేసినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు శ్రీరంగ, మండల కార్యదర్శి సతీష్ కుమార్‌లు తెలిపారు. మంగళవారం సంతకాల సేకరణ పత్రాలు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ దినోజ్‌కుమార్‌కి సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి ఎస్‌సి హాస్టల్‌ను జూన్ 2017లో మూసివేయడం జరిగిందన్నారు. మండలంలో ఉన్నటువంటి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలంటే వేరే ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు వందల సంఖ్యలో రోజు ప్రయాణం చేస్తుంటారని కావున అధికారులు స్పందించి మండలంలో ఎస్‌సి హాస్టల్‌ను పునప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షుడు రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా అభిమాన ఆదినాయకుని పుట్టినరోజు వేడుకలు

**నంద్యాల క్రైం, జనవరి 10, ప్రభాతవార్త:** ప్రజా అభిమాన ఆదినాయకుడు, జనం మెచ్చిన నేత శిల్పా పేద ప్రజల పక్షపాతి, మంచికి మారుపేరు, పరోపకారి శిల్పా ప్రజల అభిమానాన్ని చూరగొన్న నాయకుడు శిల్పా అంటే సేవకు ప్రతిరూపం. సమాజ శ్రేయస్సులో అనునిత్యం, నిరంతర శ్రామికుడు, పట్టువదలని మహానేత, శాంతిపరుడు, శాంతిశీలి ఇలా పత్రికల్లో ప్రచురించలేనంత మహానాయకుడని పలువురు నేతలు, నాయకులు కొనియాడారు. మంగళవారం మాజీ మంత్రివర ్యులు శిల్పా మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు అంబరాని ్నంటాయి. సోమవారం నంద్యాలకు వచ్చారని సమాచారం అందడంతో రాత్రి 7 గంటల నుంచి శిల్పా గృహ ప్రాంతమంతా ప్రజలు, అభిమానులు, నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి గజమాలలతో, పూలమాలలతో శాలువలు కప్పి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆ ప్రాంతంలో జనసందోహంతో కిటకిటలాడింది. భానసంచాలు పేల్చడంతో వేడుకల సమాచారాన్ని నంద్యాల పట్టణమంతా దావణంలా వ్యాపించింది. జై శిల్పా, జై శిల్పామోహన్‌రెడ్డి, శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అంటూ నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. ఇళ్లంతా సందండి నెలకొంది. అభిమానులతో చిరునవ్వులు నవ్వుతూ అప్యాయతగా పలకరింపులు. ప్రజల్లో ఆనందాన్ని ఆయన ముందు వెలిబుచ్చారు. కుశల ప్రశ్నలతో ఆయన చిరునవ్వు అపూర్వ అప్యాయతను పంచిపెట్టింది. అనంతరం మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కృషివుంటే నాస్తి దుర్భిక్షం అనే పట్టుదలతో నాడు తన తల్లి తాళిబొట్టు తాకట్టు పెట్టి వ్యాపారాన్ని మొదలుపెట్టాను. అంచలంచలుగా ఎదిగానన్నారు. నా రాజకీయ గురువు దివంగత నేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి అని సంతోషంగా గుర్తుచేసుకున్నారు. మొదట ఆచార్యరంగా వ్యవసాయ శాఖలో డైరెక్టరుగా ఒనమాలు దిద్దాను. తదనంతరం కాంగ్రెస్ పార్టీలో ఉంటూ రాజశేఖర్‌రెడ్డి అడుగుల్లో నడిచాను. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశాను. గంజి నుంచి బెంజికారు వరకు నా ప్రయాణం సాగింది. నిరుపేదలు, రైతుల సంక్షేమం కోసం శిల్పాసహకార్‌ను ఏర్పాటు చేశాను. తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులను అందిస్తున్నానని తెలిపారు. నేటి వరుకు నిర్విరామంగా శిల్పా సహకార్ సాగుతుందన్నారు. ఆర్థికంగా వెనకబడిన మహిళల సంక్షేమాన్ని దృష్టిలోపెట్టుకొని శిల్పా మహిళా సహకార్‌ను ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాలు మహిళలకు అందిస్తున్నాం. ఏటా లక్షలాది రూపాయలకు మహిళలకు అందిసు ్తన్నామన్నారు.

## ఉపాధ్యాయుల కొరత

**తుగ్గలి, జనవరి 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబ్జెకుల వారిగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెండేకల్ ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చుట్టుపక్కల గ్రామాల నుండి దాదాపు 625మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. పాఠశాలలో 21మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 9మంది ఉపాధ్యాయులు మాత్రమే భోదన చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారన్నారు. పాఠశాలలో తెలుగుకు ముగ్గురు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారని హిందీకి ఇద్దరు ఉండాల్సి ఉండగా ఉపాధ్యాయులే లేరన్నారు. ఇంగ్లీష్‌కు ముగ్గురు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారన్నారు. గణితంకు ముగ్గురు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారన్నారు. భౌతిక శాస్త్రంకు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారని, జీవ శాస్త్రంకు ముగ్గురు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉనా ్నరని, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారన్నారు. సబ్జెక్టుల వారిగా దాదాపు 12మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఖాళీగా ఉన్న సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించి పెండేకల్ ఆర్ఎస్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను విద్యాభివృద్ది వైపు అడుగులు వేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌లు కోరారు.



## బ్రిటీష్ పరిపాలన కంటే దుర్మార్గం

- సీఐటీయూ జిల్లా నాయకులు జి.శ్రీధర్

**ఓర్వకల్, జనవరి10, ప్రభాతవార్త ;** బ్రిటీష్ పరిపాలన కంటే దుర్మార్గంగా ప్రభుత్వాల తీరు ఉందని సీఐటీయూ జిల్లా నాయకులు జి.శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓర్వకల్ మండలంలోని బస్టాండు సమీపంలో సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేయాలని ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు మంగళవారం మండలకేంద్రంలో సీఐటీయూ జిల్లా నాయకులు జి.శ్రీధర్ మహాసభలను జయప్రదం కావాలని సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా నాయకులు శ్రీధర్, రైతుసంఘం మండల కార్యదర్శి ముర్తుజావలి, సీఐటీయూ మండల నాయకులు వి.సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.శ్రీధర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను, కంపెనీలను బడా కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం జీవో నంబర్ ఒకటిని తీసుకొచ్చి బ్రిటీష్ పరిపాలన కంటే దుర్మార్గమన్నారు. కార్మికుల సమస్యలు గొంతు విప్పవ మాట్లాడకుండా నోటికి తాళం వేసేవిధంగా ఈ జీవో ఉందన్నరు. కార్మిక చట్టాల పరిరక్షణకు ప్రభుత్వాల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా మహాసభలో తీర్మానాలు చేసి పోరాటాలకు సంసిద్ధం చేస్తుందన్నారు. రానున్న కాలంలో కార్మికవర్గం హక్కుల పరిరక్షణ కోసం నల్లచట్టాల రద్దుకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాషా, వెంకటేష్, శివన్న, శేఖర్, షేక్షావలి, శంకర్, కోటప్ప, రాజు, విజయ్, ప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను నిలువునా మోసం చేసిన సీఎం

- రాష్ట్రాభివృద్ధిని మరిచిన వైసీపీ ప్రభుత్వం

**కౌతాళం, జనవరి10, ప్రభాతవార్త ;** తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పారని, నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని మంత్రాలయం సీనియర్ నాయకులు ఉలిగయ్య, పల్లెపాడు రామ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలకేంద్రమైన కౌతాళంలో టీడీపీ నాయకులు నీలకంఠరెడ్డి అధ్యక్షతన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడారు. అధికారం వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తానని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్లిబుల్లి మాటలు చెప్పారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగభృతిని రద్దు చేశారన్నారు. వచ్చే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని నిరుద్యోగులను వారు కోరారు. నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచేసి పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల ప్రజల నడ్డి విరిచాడన్నారు. వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌నాయుడు, సిద్ధప్ప హాల్వి, రామలింగన్న, గొట్టయ్య, కురువ వీరేష్, కురువ కృష్ణ, వలి, ఈరన్న, మారెప్ప, నాగిరెడ్డి, గుండప్ప, అయ్య, భూషణ్‌గౌడ్, బుడదొడ్డి, ముగుతి లక్ష్మయ్య, రాజు, లింగన్న, మహంతేష్, సురేష్, ప్రకాష్, వీరారెడ్డి, రహమాన్, ఉమేష్, మండలంలోని గ్రామ నాయకుఉ, కార్యకర్తలు, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ యువత పాల్గొన్నారు.

## నేటి నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

గడివేముల, జనవరి10, ప్రభాతవార్త ; మండలకేంద్రమైన గడివేములలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సి.బి ఎలెవెన్ టీం సభ్యులు మంగళవారంనాడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోర్నమెంట్‌లో గెలిచిన జట్టుకు మొదటి బహుమతి రూ.20 వేలు దాత జిల్లా పరిషత్ సభ్యులు ఆర్‌బి చంద్రశేఖర్‌రెడ్డి, రెండో బహుమతి రూ.15 వేలు దాత భారత్‌గ్యాస్ రవికిరణ్, మూడో బహుమతి రూ.10 వేలు దాత రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల యాజమాన్యం, నాలుగో బహుమతి రూ.5 వేలు దాత వైస్ సర్పంచ్ బాలచిన్ని, బొరుగుల శీను చేతుల మీదుగా అందజేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9959549432, 9052878820 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

## కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు

- ఎంపిపి బుగ్గన నాగభూషణంరెడ్డి

**బేతంచెర్ల, జనవరి10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని ఎంపిపి బుగ్గన నాగభూషణంరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో సర్పంచ్ చిన్నమద్దమ్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, సీనియర్ నాయకుడు బుగ్గన చంద్రారెడ్డిలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామాల్లోని రైతులు, విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే మండల కేంద్రాలకు వచ్చి చేసుకోవాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే సచివాలయాలను ఏర్పాటు చేసి ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించే విధంగా పరిపాలన సాగించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో మండలంలో ఎన్నడు కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు జరిగినా విపక్షాలు విమర్శించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ముర్తుజావలి, గూని నాగరాజు, గోరుమానుకొండ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ చైర్మన్‌ను కలిసిన సర్పంచ్

**గడివేముల, జనవరి10, ప్రభాతవార్త ;** జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని గడిగరేవుల గ్రామ సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం కలిశారు. గ్రామంలో గల అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే జెడ్పీహెచ్ హైస్కూల్‌లో సమస్యల పై చర్చించి, స్కూల్‌లో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేయాలని కోరారు. జెడ్పీటీసీ చైర్మన్ ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు గ్రామసర్పంచ్‌రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

## ఉపాధి కూలీలను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమిస్తాం

**పత్తికొండ, జనవరి10, ప్రభాతవార్త:** మండలంలోని ఉపాధి కూలీలకు తక్షణమే ఉపాధి పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబీరసూల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ పట్టణంలో జగనన్న కాలనీని సందర్శించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, ఏపీడీ వెంకటలక్ష్మి లను నబీరసూల్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాలలో ఉపాధి కూలీలకు పనులులేక వలసలు పోతున్నారని అధికారుల నిర్లక్ష్యం వహిస్తూ ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో ఘోరంగా విఫలం చెందారని ఆయన తెలిపారు. ఉపాధి పనులు కల్పించకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలతో కలిసి ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కర్నూలు జిల్లా అధికారులు స్పందించి వలసల నివారణకు ఉపాధి పనుల దినాలను పెంచాలని, వలస కూలీల జాబ్ కార్డులను 200రోజుల పనిదినాలను పెంచాలని ఆయన కోరారు. రోజుకు కూలీ రూ.600లు పడే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు, ప్రజా సంఘాల నాయకులు నరసింహులు, రాజాసాహెబ్, కృష్ణయ్య, నారన్న, సుల్తాన్, కారుమంచి, మాదన్న, నెట్టె కంటయ్య, వెంకటరామిరెడ్డి, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు ఫేస్ యాప్‌లను రద్దు చేయాలి

**నందికొట్కూరు, జనవరి 10, ప్రభాతవార్త:** అంగన్వాడీలకు కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఫేస్ యాప్‌లను రద్దు చేస్తు కనీస వేతనం రూ.26వేలు చేయాలని సిఐటియు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.బాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేసి డిప్యూటి తహసిల్దార్ పద్మావతికి వినత పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు అంగన్వాడీ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయాల పర్యవేక్షణలో పని చేయాలని నిర్ణయించారని, ఐసిడయస్ అధికారులు, పీడి, సిడిపిఓ, సూపర్వఐజర్లు పర్యవేక్షిస్తున్నారని, కేంద్రాలను బలోపేతం చేయడానికి నిధులు పెంచి అంగన్వాడీలకుఉ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పాలకులు, అధికారులు విజట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని, వారు మానసిక ఒత్తిళ్ళకు గురు అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు టౌన్ అధ ్యక్ష కార్యదర్శిలు గోపాలక్రిష్ణ, ఆర్.జయ, ప్రాజెక్టు అధ్యక్షురాలు మధార్‌బీ, శైలజ, అనురాధ, కృషిద్బి, పద్మావతి, రాజేశ్వర తదితరులు పాల్గొన్నారు.

వార్త



## ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**బనగానపల్లె, జనవరి10, ప్రభాతవార్త:** మండలంలోని వెంకటాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభించారు. ఈ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పర్యటించగా గ్రామస్తులు సీసీ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు గ్రామ సచివాలయానికి కేటాయించిన నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని వైసీపీ నాయకులు తూర్పింటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం

:-టిడిపి ఇంఛార్జ్ తిక్కారెడ్డి



ఇదేంఖర్మ కార్యక్రమంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

**మంత్రాలయం, జనవరి 10, ప్రభాతవార్త:** ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడ లో పూర్తిగా విఫలమయ్యిందని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జ్ తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలోని రాఘవేంద్రపురంలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రజల నిత్యవసర ధరలు అమాంతంగా పెరిగినట్లు చెప్పారు. ఎన్నికలసమయంలో ఎన్నో వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి జగన్ తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాగ్దానాలు నెరవేర్చడం లేదని విమర్శించారు. ఇంటింటికీతిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారం చేపట్టిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్, ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, గోపాలప్ప స్వామి, ఎంపిటిసి నక్కి వెంకటేష్, యోబు, మేకలనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్



జగనన్న ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

**పత్తికొండ, జనవరి 10, ప్రభాతవార్త :** పత్తికొండ డివిజన్‌లోని తహశీల్దార్లతో కలెక్టర్ పి కోటేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్బంగా కలెక్టర్ పి కోటేశ్వరరావు మాట్లాడుతూ అసైన్‌మెంట్ భూములపైన, జగనన్న హౌసింగ్‌లపైన, ఎమ్మెల్సీ ఎన్నికలపై, నవరత్నాలు వివిధ సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. అనంతరం పట్టణ సమీపంలో ఉన్న 130/3సర్వేనంబర్‌లో జగనన్న ఇళ్లను పరిశీలించారు. పత్తికొండ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఐ.సి.డి.యస్.కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్జేడి

**నందికొట్కూరు, జనవరి 10, ప్రభాతవార్త:** పట్టణంలోని ఐ.సి.డి.యస్. కార్యాలయాన్ని రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఐసిడియస్ ప్రాజెక్టు, ఫ్రీస్కూల్ యాక్టివిటి గురించి, గ్రోత్ రిజిష్టర్స్‌ను పరిశీలించారు. సి.డి.పి.ఓ. కోటేశ్వరిని కేంద్రాల గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె సూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతు అంగన్వాడీ కేంద్రాలలో గర్భవతులకు, బాలింతలకు మెను ప్రకారం క్వాలిటితో పౌష్టికాహారం సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని సూచించారు. గ్రోత్ మ్యానిటరింగ్ ఎలా చేస్తున్నారని, కేంద్రాలు సమయపాలన పాటించేలా చూడాలని ఆదేశించారు. మిషన్లు సక్రమంగా లేవని వారు ఆర్జేడి దృష్టికి తీసుకెళ్ళగా ఫోన్ తరహాలో కొత్తవి వస్తాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆశీర్వాదమ్మ, కె.వి.రమణమ్మ, నజ్మీతుల్లా, శేషమ్మ, వేంకటేశ్వరమ్మ, రేణుక, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



## ఎంపిక కాని వాలంటరీలు ఎవరైనా పని చేస్తున్నారా..

**కోవెలకుంట్ల, జనవరి 10, ప్రభాతవార్త :** మండల పరిదిలోని సచివాలయాల్లో ఎవరైన ఎంపిక కాని వాలంటరీలు అంటే పెళ్లి అయిఅత్త వారి ఇంటికి వెల్లగా వారి స్ధానములో మరొకరు ఎవరైన విదుల్లో పని చేస్తున్నారా అంటు సచివాలయ సిబ్బందిని యంపిడిఓ మహమ్మద్‌దౌలా ప్రశ్నించారు. మంగళవారము స్థానిక మండల పరిషత్ కార్యాలయాంలో మండలంలోని అన్ని సచివాలయ ఉద్యోగులతో యంపిడిఓ మహమ్మద్ దౌలా సమీక్ష నిర్వహించారు. ఈసందర్బముగా అయన మాట్లాడుతు ఒక్కోక్క సచివాలయ సిబ్బందితో వరుసగా మాట్లాడారు. మీమీ సచివాలయంలో ఎంపికైన వాలంటరీలకు ఎవరికైన పెళ్లి జరిగి అత్తవారి ఇళ్లకు వెల్లారు అలాగే వారి స్ధానములో వారికి ఎంబందించిన బందువులు విదుల్లో పాల్గొంటున్నారా చెప్పాలని కోరారు. అయితే ఎవరు దానికి జవాబు చెప్పలేదు. అయితే మండలంలోని నకిలీ ఫింగరు ఫిన్సులు బయట పడ్డాయని దానికి సంబందించి విచారణ చేపట్టాలని అదేశాలు అందాయని చెప్పారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది వాలంటరీలపై అజమాయిసీ ఉండటము లేదని ఉంటే ఈ నకిలీ ఫింగరు ఫిన్సు ఎలా వస్తాయని అన్నారు. అనంతరము మూడు గ్రామాల సచివాలయ సిబ్బందితో అయన ప్రత్యేకంగా మాట్లాడారు అనంతరము కోవెలకుంట్ల 4వ సచివాలయంలో వాలంటరీగా ఉన్న దూదేకుల దస్తగిరి ఒక వాలంటరీని తొలగించామని విలేకర్లకు చెప్పారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న యంపిడిఓ

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

**మద్దికెర, జనవరి 10, ప్రభాతవార్త :** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మద్దికెరలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీదేవి కాలనీలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా..లేదా..అని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందకపోతే తక్షణమే వారు లబ్దిపొందేలా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు ప్రజాధారణ పొందుతున్నాయన్నారు. సిఎం జగన్ ప్రజల నమ్మకాన్ని సంపాదిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం నాడు-నేడు కార్యక్రమం, అలాగే వృద్దాప్య, వితంతు, వికలాంగుల ఫించన్లు రూ.2500ల నుండి రూ.2750కు పెంచి ఇంటికి పెద్దకొడుకులా నిలిచాడన్నారు. ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థలో 13రకాల సేవలు అందిస్తున్నారని ఆ సేవలను వినియోగించుకోవాలన్నారు. లబ్దిదారులను గుర్తించి ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అంతకుముందు గ్రామస్తులు ఎమ్మెల్యే శ్రీదేవికి పూలమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మురలీధర్‌రెడ్డి, కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, ఎంపిపి అనిత యాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని, ఎంపిటిసిలు, వార్డుమెంబర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 48 అంజెండా అంశాలతో దర్మకర్తల మండలి సమావేశం



**శ్రీశైలంప్రాజెక్టు, జనవరి10, ప్రభాతవార్త :** 48 అజెండా అంశాలతో మంగళవారంనాడు శ్రీశైలందేవస్థానం పరిపాలన భవనంలో దర్మకర్తల మండలి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ అంశాలన్ని దేవస్థానం దర్మకర్తల మండలి ఆధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి ఆధ్యక్షతన సమీక్షించడం జరిగింది. ఈ సమావేశంలో శ్రీశైలందేవస్థానం ఈఓ ఎస్.లవన్న పాల్గొన్నారు. గంటల తరబడి జరిగిన సమావేశంలో అజెండాలో 48 అంశాలు ఉంచగా వాటిలో 43 అంశాలను అమోదించడం జరిగిందని దేవస్థానం పత్రిక ప్రకటన ద్వారా వెల్లడిపరిచింది. తక్కిన వాటిలో 3 అంశాలు వాయిదా వేసినట్లుగా, 2 అంశాలను తిరస్కరించినట్లుగా తెలియపరచడం జరిగింది. సమావేశం అమోదించిన వాటిలో భక్తుల సౌకర్యార్ధం నూతనంగా రూ.75 కోట్ల అంచనా వ్యయంతో క్యూకాంప్లేక్స్ నిర్మించాలని, మల్లికార్జున సదన్‌పై రూ.5,80,00,000 ల అంచనా వ్యయంతో రెండవ అంతస్తు నిర్మించాలని, భూసర్వే ఆధారంగా గుర్తించబడిన దేవస్థానపు 7 చదరపు మైళ్ళ విస్తిరణములో గల దేవస్థానం సరిహద్దు చుట్టూ రూ.5,50,00,000లకు అంచనా వ్యయంతో ఫెన్సింగ్ వేయాలని తదితర అబివృద్ధి పనులపై కమీషనర్ దేవదాయశాఖ వారి నుండి పరిపాలన మరియు సాంకేతిక అనుమతులు వచ్చిన తదుపరి నిర్మాణానికి టెండర్లు పిలవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్మకర్తల మండలి సభ్యులు మతం విరుపాక్షయస్వామి, జంగం సుజాతమ్మ, విజయలక్ష్మి, మేరాజోత్ హనుమంతునాయక్, తన్నీరు ధర్మరాజు, ఎ.లక్ష్మి సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ధర్మకర్తల మండలి సమీక్ష రసబసానా...?** శ్రీశైలం దేవస్థానం పరిపాలన భవన సమావేశ మందిరంలో మంగళవారంనాడు జరిగిన దర్మకర్తల మండలి సమీక్ష సమావేశం రసబసాగా జరిగిందా...? సమావేశం ముగిసిన అనంతరం ధర మ్కర్తల మండలి ఆద్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి ఆధ్యక్షతన, ఈఓ లవన్న, సభ్యుల సమక్షంలో సమావేశ వివరాలు మీడియాకు వివరించే ప్రక్రియ ప్రతిసారి జరుగుతుంది. అయితే ఈ సారి జరిగిన సమావేశ వివరాలను ఆద్యక్షులు మీడియాకు వెల్లడిపరచకుండానే వెళ్లిపోవడం మీడియా మిత్రుల మధ్య చర్చానీయాంశంగా మారింది. అయితే దేవస్థానం తరుపున పత్రిక ప్రకటన ద్వారా వివరాలు తెలియపరచడం జరిగింది. అసలు సమావేశంలో ఏమి జరిగింది...? ప్రతి సమావేశం అనంతరం మీడియాకు వివరాలు వెల్లడింపరిచేవారు ఈ సమావేశం వివరాలను తెలియపరచకపోవడంలో అంతర్యం ఏమైన ఉందా...? దేవస్థానం మీడియాకు సంబందించిన వాట్స్‌ప్ గ్రూప్‌లో దర్మకర్తల మండలి సమావేశ అనంతరం వివారాలు మీడియాకు వెల్లడిపరచడం జరుగుతుందని తెలియపరచడం జరిగింది. అయితే సమావేశ అనంతరం మీడియాకు అజెండా అంశాలను దర్మకర్తల మండలి వెల్లడిపరచకుండా పోవడం గమనార్హం.

## ప్రజా వ్యతిరేఖ ప్రభుత్వంకు చమర గీతం పాడుదాం - మాజీ ఎమ్మెల్యే బీవీ



**గోనెగ ండ్ల జనవరి 10 ప్రభాతవార్త :** ప్రజా వ్యతిరేఖ ప్రభుత్వంగా మారిన వైసీపీ కి ఇక చమరగీతం పాడాల్సి న సమయం దగ్గర పడిందని మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అన్న కార్యాక్రమాన్ని బీవీ జయనాగేశ్వరరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామంలో టీడీపీ జెండాను ఎగర వేశారు. గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం బీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన అస్థవ్యస్థంగా మారిందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మచ్చుకైన కనిపించడం లేదన్నారు. ప్రతి పక్షాలు ర్యాలీలు, నిరసనలు, రోడ్డు షోలు, సభలు, సమావేశాలు పెట్టు కోరాదు అంటు చీకటి జీవో 1, అమలు జరుపుతున్న రాష్ట్ర సీఎం ఒక నియంత అని ఆయన అన్నారు. ఈలాంటి నియంతలకు పోయేకాలం దగ్గరలో ఉందన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని అభివృద్ధి పనుల కనిపించడం లేదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు ఎమైందని ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తే వారి పై కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ఇంత అరాచక అసెంబ్లీని నాజీవితం లో చూడలేదు అన్నారంటే అక్కడ వైసీపీ ఎమ్మెల్యేలు ఎంత దారుణంగా వ్యవహరిస్తున్నారో దీన్నిబట్టి అర్థమవుతుందన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం లోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు గాను రూ.157కోట్లతో వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేసేందుకు టీడీపీ ప్రభుత్వంలో నిధులు కూడా మంజూరు చేశారు. అయితే ఎన్నికల కోడ్ వల్ల నిధులు విడుదల కాలేదు. కావున ఆ నిధులను ఇప్పుడు విడుదల చేసి వెంటనే వాటర్ గ్రిడ్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మూడున్నరేళ్లలో విద్యుత్, పెట్రోల్, డిజిల్, ఇసుక, సిమెంట్, ధరలు విపరీతంగా పెంచారని అన్నారు. వైసీపీ తన స్వంత ప్రయోజనాల కోసమే ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతన్నారని అన్నారు. అనంతరం గ్రామంలో ఇదేమి ఖర్మ కార్యక్రమానికి సంబందించిన కరపత్రాలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్య నాయుడు, నూరఅహ్మద్, రంగన్న, గంజహళ్లి రంగరెడ్డి, భారతం రహంతుల్లా, ఎర్రబాడు శ్రీనివాసులు, కులుమాల రాముడు, చాంద్‌భాష, రాముడు, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

## సచివాలయాన్ని అకస్మిక తనిఖీ : తహసిల్దార్



**నందికొట్కూరు, జనవరి 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరులోని సచివాలయాన్ని మంగళవారం తహసిల్దార్ పుల్లయ్యయాదవ్ అకపస్మిక తనిఖీ చేసి రికార్డులను, హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరులోని సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఒక్కరు సమయపాలన పాటిస్తు బయోమెట్రిక్ తప్పని సరిగా వేయాలని, అలాగే జగనన్న కాలనీలో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నేషనల్ హైవేలో పోయిన భూముల వివరాలు తెలుసుకున్నారు. స్పందనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి ఎప్పటికప్పుడు పరిష్కారించాలని సిబ్బందికి సూచించారు, ఈ కార్యక్రమంలో వి.ఆర్.ఓ.నరసరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు తిరగబడితే తాడేపల్లి కొంపలో ఉండలేవు..!

:- మాజీ శాసనసభ్యులు, టిడిపి ఇంఛార్జ్ మీనాక్షినాయుడు



**ఆదోని రూరల్, జనవరి 10, ప్రభాతవార్త :** ప్రజలు తిరగబడితే జగన్‌రెడ్డి తాడేపల్లి కొంపలో ఉండకుండ ఈ రాష్ట్రం వదిలి పరుగులు పెడతాడని మాజీ శాసనసభ్యులు, టిడిపి ఇంఛార్జ్ మీనాక్షినాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కపటి గ్రామంలో స్థానిక తెదేపా నేతలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ సైకో పోవాలి..సైకిల్ రావాలి..ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా మీనాక్షినాయుడు మాట్లాడుతూ దాదాపు మూడున్నరేళ్ల పైబడినా ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ఎన్‌టి రామారావు, నారా చంద్రబాబునాయుడులు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు ఇచ్చిన ఫించన్లు తీసివేయడానికి నువ్వు ఎవరివి అన్నారు. బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదని పప్పు, ఉప్పు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పేదవాడు ఆనందంగా పండుగ జరుపుకోవడానికి సంక్రాంతి కానుక ఇవ్వడం లేదన్నారు. అలాగే చంద్రన్న భీమా, పెళ్లికానుక, ఎస్‌సి కార్పొరేషన్ లోన్‌లు, బిసి కార్పొరేషన్ లోన్‌లు ఏ ఒక్కటీ ఇవ్వడం లేదన్నారు. మనం కట్టిన ఇళ్లు, వేసిన రోడ్లు, లైట్లు తప్ప పెద్దగా ఈ వైసిపి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిందేమీ లేదన్నారు. ఊళ్లలో రోడ్లు వేయాల్సి న డబ్బుతో సచివాలయాలు కడుతున్నారని, వాలంటరీలకు డబ్బులు ఇస్తున్నారన్నారు. ఉద్యోగులకు జీతాలు సరిగా ఇవ్వడం లేదని ప్రజలు తిరుగుబాటు చేస్తే పోలీసులు కూడా ఏం చెయ్యలేరు జగన్‌రెడ్డి అని అన్నారు. ప్రజాధనాన్ని అంతా వాళ్ల శిలాఫలకాలు, వాళ్ల పేర్లకు ఉపయోగిస్తున్నారని ఈ భారం అంతటిని పన్నుల రూపంలో మరల మనవద్దనుంచే వసూలు చేస్తూ తాట తీస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రం అంధకారంలోకి వెళ్లకుండ ఉండాలంటే సైకో పోవాలి..సైకిల్ రావాలన్నారు. కర్నూలు జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్‌చౌదరి, నాయకులు రంగస్వామి నాయుడు, రంగన్న, సర్పంచ్ కీర్తి, మాజీ సర్పర్ మాధవ్, బాలస్వామి, శివ, జీవన్, బుద్దారెడ్డి, వెంకటేష్, మాభాష, లక్ష్మీనారాయణ, శివప్ప, అరెకల్ రామకృష్ణ, బాలాజీ, శ్రీనివాస్ ఆచారిలు పాల్గొన్నారు.

## పాత బ్రిడ్జిని పున:నిర్మించాలి



**ఆదోనిటౌన్, జనవరి10, ప్రభా తవార్త ;** పట్టణంలో నడిబొడ్డున ఉన్న పాత ఓవర్ బ్రిడ్జిని పున:నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ఆర్అండ్‌బి అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్, పట్టణాధ్యక్షుడు మహదేవ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పాత ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిడ్జి దాదాపు 65 సంవత్సరాల క్రితం నిర్మించారని, ప్రస్తుతం బ్రిడ్జి పరిస్థితి చాలా అధ్వానంగా శిథిలావస్థకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులు చేయాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాత బ్రిడ్జిని పున:నిర్మించేందుకు నివేదికలు తయారు చేసి జిల్లాల కలెక్టర్, సీఎం, నేషనల్ హైవే అథారిటీ అధికారులకు, మంత్రికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డే శ్రీనివాసులు, ఉరుకుందగౌడ్, విజయ్, ముఖేష్, విష్ణు, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

## కలాం పాలిషింగ్ యూనిట్‌ను ప్రారంభించిన బైరెడ్డి



యూనిట్‌ను ప్రారంభిస్తున్న బైరెడ్డి

**మిడుతూరు, జనవరి10, ప్రభాతవార్త ;** మండలంలోని నాగలూటి గ్రామంలో మంగళవారం ఉప మండలాధ్యక్షుడు నభిరసూల్, వైసీపీ నాయకులు సర్వేశ్వర్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కలంపాలిసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ముందుగా ముఖ్యఅతిథిగా వచ్చిన బైరెడ్డి మిషన్‌ను బటన్ నొక్కి ప్రారంభించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెరుకుచర్ల గ్రామానికి చెందిన పేరెడ్డి భాస్కర్‌రెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.25 లక్షలు విలువ గల చెక్కును బైరెడ్డి చేతులమీదుగా అందజేశారు. అనంతరం వైసీపీ నాయకులు సర్వేశ్వర్‌రెడ్డి గృహంలో భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తువ్వ చిన్న మల్లారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నాగతులసిరెడ్డి, ఉప మండలాధ్యక్షుడు నభిరసూల్, సర్పంచ్ ఉషారాణి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, చిన్నపుల్లారెడ్డి, బన్నూరు నాగిరెడ్డి, ఎల్లారెడ్డి, కృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి, కరీం, అజీజ్, ఉప సర్పంచ్ తువ్వా లోకేశ్వర్‌రెడ్డి, మల్లు శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీదేవి

**పత్తికొండ, జనవరి10, ప్రభాతవార్త:** పత్తికొండ మండలంలోని హోసూరు గ్రామంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శ్రీదేవి మంగళవారం ప్రారంభించారు. వీరభద్రస్వామి రథోత్సవం సందర్భంగా హోసూరు గ్రామంలో ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించడం జరిగింది. క్రీడాకారులు స్నేహపూర్వకంగా క్రికెట్‌ను ఆడాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా అందించడంతోపాటు మెనూను పాటించాలని ఆమె సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. రైతుభరోసా కేంద్రం-2లో వైఎస్సార్ యాంత్రీకరణ సేవ కింద మంజూరుచేసిన శివశక్తి గ్రూప్‌కు పప్పుశనగ మిషన్లను లబ్దిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నెట్టేకల్, నాగప్ప, వైసీపీ నాయకులు బనగాని శ్రీను, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె, జనవరి10, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తాడేపల్లె లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వివరించడమే కాకుండా నియోజకవర్గంలోని అవుకు, బనగానపల్లె, కొలిమిగుండ్ల మండలాల్లో మైనింగ్ సమస్య మరియు బనగానపల్లె పట్టణ ప్రజలకు అందించాల్సిన ఉచిత ఇంటి స్థలాల గురించి వివరించడం జరిగిందని అలాగే నియోజకవర్గ సమస్యల గురించి సీఎం దృష్టికి తీసుకుపోగా ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలియజేశారు. అలాగే బనగానపల్లె పట్టణంలో రూ.22కోట్లతో వంద పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆహ్వానించడం జరిగింది.

## వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వెంకాయ్‌పల్లె ఎల్లమ్మ చైర్మన్ బేతంకృష్ణుడు



వార్త పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ బేతంకృష్ణుడు.

**కర్నూలు రూరల్, జనవరి 10, ప్రభాతవార్త :** కర్నూలు మండలం వెంకాయ్‌పల్లిలో గ్రామం సమీపంలో వెలసిన శ్రీ ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో మంగళవారం దేవస్థాన చైర్మన్ బేతంకృష్ణుడు, పూజారులు ఎల్లరాజు, బాలు, రామళ్లకోట ఎం.వీరబ్రహ్మం వార్త జాతీయ దినపత్రిక 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆలయ చైర్మన్ బేతంకృష్ణుడు మాట్లాడుతూ సమాజంలో ఎన్నో పత్రికలు ఉన్నా వార్తకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక సంచలన పత్రికగా వార్త నడిచిందన్నారు. వార్త పత్రిక ఎప్పుడు ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపుతుందన్నారు. 23 సంవత్సరాల నుంచి వార్త జాతీయ దిన పత్రిక ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ విలేకరి రమేష్, సునీల్, బేతం నాగమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధక టీకాలు 100 శాతం పూర్తిచేయాలి

-చిన్నారుల సంరక్షణే వైద్యశాఖ ధ్యేయం-డిఎంఅండ్‌హెచ్‌ఓ

**నంద్యాల విద్య, జనవరి 10, ప్రభాతవార్త:** జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసౌకర్యాలు అందడంతో పాటు ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం ఆసుపత్రిలో సిహెచ్‌ఓ, ఎంపిహెచ్‌ఓ, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫ్యామిలి ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం సమయ పాలన పాటిస్తు పకడ్బందిగా నిర్వహించాలని అనేమియా ముక్తభారత్ మరియు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఎంఆర్ 1, ఎంఆర్ 2 వ్యాక్సినేషన్ నూరుశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.ఔకు ప్రభావతిదేవి మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు వేయించుకున్న పిల్లల వివరాలన్నింటిని ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదుచేయాలని అర్హత గల పిల్లలందరికి వ్యాధినిరోధక టీకాలు వేయించాలని తెలిపారు. పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తుందని వారికి సరైన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా వారి భవిష్యత్తు ఆరోగ్యకరంగా ఉంటుందని తెలిపారు. డా.బాలాజీ మాట్లాడుతూ ఎన్‌సిడి, సిడి, టిబి కార్యక్రమాలు నూరుశాతం పూర్తిచేయాలన్నారు. ఏఓ డా.చంద్రశేఖర్, ఫ్యామిలి ఫిజిషియన్ కాన్సెప్ట్ నోడల్ అధికారి డా.జగదీష్ చంద్రారెడ్డి, డా.సుజాత, డిపిఎంఓడా.రేఖ, డిపిఓనజ్నీమ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి